



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 122 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : డాక్టర్ బి.ఆర్. అంబెద్కర్ కోనసీమ జిల్లా శనివారం 14 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 122 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : Dr. B.R. AMBEDKAR KONASEMA DIST SAT 14 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,Thadepalligudem,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## వారిని అంతం చేస్తున్నా



### ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక

**పెన్ పవర్ డెస్క్:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచ ెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని

మిగతా 2లో

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

**పెన్ పవర్ డెస్క్:**ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర (82) కన్నుమూశారు. ఆయన ఆరోగ్య పరిస్థితి విషమిం చడంతో, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. హెచ్ జే దొర కొంతకాలంగా కిడ్నీ సమస్యల తో బాధపడుతున్నారు. ఆయన క్రమం తప్పకుండా డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఉదయం హైదరాబాద్ లోని నిమ్స్ లో డయాలసిస్

మిగతా 2లో



## పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు...

### సీఎం ఫోటో చిన్నదిగా ఉండటంపై వర్మ ఆగ్రహం



**పెన్ పవర్ డెస్క్:**సీఎం చంద్రబాబుకు అవమానం జరిగిందంటూ టీడీపీ నేత, పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎస్వీఎస్ఎన్ వర్మ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ కార్యక్రమం కోసం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఫోటో చిన్నదిగా ఉందంటూ, వర్మ తీవ్ర అసంతృప్తి వెలిబుచ్చారు.పిఠాపురం మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికుల కోసం ఒక శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వర్మ, వేదికపై ఉన్న ఫ్లెక్సీని గమనించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు చిత్రాన్ని చిన్నదిగా ముద్రించి అవమానించారని ఆయన ఆరోపించారు. "ముఖ్యమంత్రికి గౌరవం లేని చోట నేను కూర్చోలేను" అని మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, వేదిక ఎక్కకుండానే అక్కడి నుంచి వెనుదిరిగారు. బయటికి వచ్చిన తర్వాత

మిగతా 2లో

## బడి భోజనంలో తేడాలొస్తే కఠిన చర్యలు

### మంత్రి నారా లోకేశ్ సీరియస్ వార్నింగ్



**పెన్ పవర్ డెస్క్:**ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం విషయంలో రుచి, శుచి, నాణ్యత లేదా పోషక విలువలు తగ్గితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రంగా హెచ్చరించారు. అపర అన్నపూర్ణమ్మ డొక్కా సీతమ్మ పేరుతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఈ పథకంపై కుట్రలు చేసినా, నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని ఆయన స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం అమలుపై విద్యాశాఖ ఉన్నతాధికారులతో ఆయన ఫోన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా మైలవరం తారక రామానగర్‌లోని మండల పరిషత్ పాఠశాలలో భోజనం బాగాలేదంటూ ఆ స్కూల్ హెడ్మాస్టర్ జాన్ స్వయంగా విద్యార్థులను తప్పుదోవ పట్టించి, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన ఘటనపై అధికారులు మంత్రికి వివరించారు. దీనిపై స్పందించిన లోకేశ్, ఇలాంటి కుట్రపూరిత ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని సూచించారు. మన పిల్లలకు పెట్టే భోజనంపై ఎంత శ్రద్ధ తీసుకుంటామో, ప్రభుత్వ బడుల్లోని పిల్లల విషయంలో అంతకంటే ఎక్కువ

మిగతా 2లో

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

### రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు... పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట

**పెన్ పవర్ డెస్క్:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు,



చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్‌వి) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు

మిగతా 2లో

## ఏపీలో రూ.47 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత



**పెన్ పవర్ డెస్క్:** ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మాదకద్రవ్యాల తయారీపై డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) భారీ కొరడా ఝుళిపించింది. ఎన్టీఆర్ జిల్లా కొండపల్లి పారిశ్రామిక వాడలో ఎన్‌డీపీఎస్ చట్టం-1985 పరిధిలోకి వచ్చే సైకోట్రోపిక్ పదార్థమైన అల్ప్రజోలంను రహస్యంగా తయారు చేస్తున్న ఓ ఫ్యాక్టరీ

మిగతా 2లో



## ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం. దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది. ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో

మిగతా 2లో

## ఎల్పీజీ కొరత.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు


**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దేశవ్యాప్తంగా ఎల్పీజీ కొరత వినియోగదా రులను ఆందోళనకు గురిచేస్తోంది. ఇప్పటికే బెంగళూరు, ముంబై, ఢిల్లీ, హైదరాబాద్ తదితర నగరాల్లో వాణిజ్య సిలిండర్ల కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్లు తాత్కాలికంగా మూతపడ్డాయి. వంట గ్యాస్ కొరత కారణంగా గృహ వినియోగదారులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వంట గ్యాస్ ఇళ్ల వరకు రావడానికి రోజుల సమయం పడుతుండటంతో వినియోగదారులు వివిధ ప్రాంతాల్లో గ్యాస్ గోడౌన్ల వద్దకు వచ్చి క్యూ కడుతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో,

మిగతా 2లో



## అమరావతిలో బిట్స్ పిలాని ఏఐ క్యాంపస్..

### ప్లాన్లను పరిశీలించిన మంత్రి నారా లోకేశ్




**పెన్ పవర్ డెస్క్:**ఏపీ రాజధాని అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించతలపెట్టిన బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (BITS) పిలాని 'ఏఐ ప్లస్ క్యాంపస్' నిర్మాణ ప్లాన్లను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేడు పరిశీలించారు. ఉండవల్లిలోని నివాసంలో బిట్స్ ప్రతినిధులు సిద్ధార్థ బెనర్జీ, ఎన్.చెన్నవీర్, బీఎస్ సహాని మంత్రి నారా లోకేశ్ ను కలిసి క్యాంపస్ నిర్మాణ ప్రణాళికలను వివరించారు. నిర్మాణ ప్లాన్లను, డిజైన్లను ప్రదర్శించారు. ఈ సందర్భంగా బిట్స్ ప్రతినిధులు మాట్లాడుతూ, రెండు దశల్లో 7 వేల మంది విద్యార్థులకు విద్యనందించేలా ఈ క్యాంపస్‌ను నిర్మిస్తున్నామని తెలిపారు. రానున్న ఐదేళ్లలో దీనిపై రూ.1,000 కోట్ల

మిగతా 2లో

## ఏపీ ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించిన పేర్ని నాని



**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని ఈరోజు సమావేశంలో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, శాంతిభద్రతలపై ఆయన పలు ప్రశ్నలు సంధించారు. హెరిటేజ్ సంస్థకు రాయితీలు ఇస్తున్నారంటూ మండిపడ్డారు.రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను 'అప్పుల మంత్రి'గా

మిగతా 2లో

## హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు



**పెన్ పవర్ డెస్క్:**మాజీ మావోయిస్టు అగ్రనేత దేవ్‌జీ (తిప్పిరి తిరుపతి) లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఆయుధాలను వదిలేసి ఆయన జన జీవన స్రవంతిలో కలిసిపోయారు. ఆయన ఈరోజు ఒక మీడియా ప్రతినిధితో మాట్లాడుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. హిడ్మా లొంగిపోతానని చెప్పినప్పుడు తాము వారించామని, అయితే

మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

### భూమాత జీవనాడులు జీవనదులు

భూగ్రహ జీవనాడులగా జీవనదులు భూమాత ఉపరితలంపై నిరంతరం పారుతూనే ఉన్నాయి. నదులు ప్రవహించే జలాలు మాత్రమే కాదు, భూమండల గుండె సవ్వడులు. ఈ పుణ్య నదులు ధరణికే ప్రాణమిచ్చే వరాలు. పృథ్వీపై నెలకొన్న సహజ నదులు దేవుడిచ్చిన అపూర్వ వరప్రసాదాలు. జీవనదులు బిలియన్ల మానవాళికే కాదు సకల జీవకోటికి అవసరాలకు తాగు నీటిని, ఆహారాన్ని, జీవనోపాధులను కల్పిస్తున్నాయి. నదీ తీరాలు మానవ వికాస కేంద్రాలు, ఆవాస క్షేత్రాలు. ప్రపంచవ్యాప్త జీవవైవిధ్య పునరుద్ధరణతో పాటు సంరక్షణ భాధ్యతలను తీసుకుంటున్నాయి. సువిశాల భారత దేశ పుణ్య భూమిపై ప్రవహిస్తున్న గంగా, గోదారి, యమున, నర్మద, సింధు, మహానది, కావేరి లాంటి జీవనదులు దేవతలుగా పూజించబడుతున్నాయి. ఏ దేశంలోనైనా నదులు జీవకోటికి తాగు నీటిని ఇవ్వడమే కాకుండా వ్యవసాయం, పరిశ్రమలు, ఉపరితల రవాణా రంగాలకు ఊపిరిగా నిలుస్తున్నాయి. నీటి ప్రాధాన్యాన్ని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం ఇటీవల 'జల శక్తి మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేసి పలు నదీ పరిరక్షణ చర్యలను తీసుకుంటున్నాయి. గత ఐదు దశాబ్దాలుగా మంచి నీటి వనరుల్లో జీవించే జీవరాశుల్లో దాదాపు 83 శాతం వరకు కనుమరుగా అయ్యాయని తెలుస్తున్నది. నేటి డిజిటల్ యుగంలో మారుతున్న జీవనశైలి, జీవన విలువల నడుమ నదుల పరిరక్షణ యజ్ఞానికి అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి. నదీ జలాల కాలుష్యం, పారిశ్రామిక వ్యర్థాల తల నొప్పి, నదీ జలాల దుర్వినియోగం, అర్థరహిత డ్యామ్‌ల నిర్మాణం, జలాల అక్రమ తరలింపు, వాతావరణ ప్రతికూల మార్పులు, స్వార్థానికి నదీమతల్లిని వెన్నుపోటు పొడవడం, అక్రమ మైనింగ్, అడవుల నరికివేత, ఆహార అభద్రత, ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం, నదీ జలాల పరిరక్షణ చట్టాల ఉల్లంఘనలు లాంటి కార్యకలాపాలతో నదులు పలుచబడడం లేదా నదీ జలాలు గరళ కేంద్రాలుగా మారడం కొనసాగుతున్నది. నదీ జలాల పరిరక్షణ, పునరుద్ధరణ చర్యలను వేగవంతం చేయడానికి ప్రజా చైతన్య కార్యక్రమాల నిర్వహణకు 1997 నుంచి ప్రతి ఏట 14 మార్చిన ప్రపంచవ్యాప్తంగా "అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినం" లేదా "ఇంటర్నేషనల్ డే ఆఫ్ ఆక్షన్ ఫర్ రివర్స్" వేడుకలను నిర్వహించడం జరుగుతున్నది. 2026 అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినం ఇతివృత్తంగా "మన నదులు, మన భవిష్యత్తు" అనబడే అంశాన్ని గత కొన్ని సంవత్సరాలకు నిర్ణయించి ప్రచారం నిర్వహించుట జరుగుతోంది. నీటి కాలుష్య కట్టడి, నీటిని వ్యాపారంగా మార్చే ప్రైవేట్ రంగాల రెక్కలు విరవడం, నదీ జలాల దుర్వినియోగాలను అరికట్టడం, వ్యర్థాలను నదుల్లో కలుగకుండా అడ్డుకట్ట వేయడం, శుద్ధ జలాల సంరక్షణ, నదీ తీరాల దురాక్రమణలను వ్యతిరేకించడం, వాటర్ షెడ్ నిర్మాణాలు చేపట్టడం, నదుల జీవ వైవిధ్యాలను కాపాడడం లాంటి చర్యలు తీసుకోవడం ద్వారా నదుల పునరుద్ధరణ జరిగి పూర్వపు శుద్ధ జలాలు తిరిగి జర జరా వాగులై, ఏరులై, నదులై పల్లపు ప్రదేశాల వైపు నవ్వుతూ ప్రవహిస్తాయి. భూమిని ఒక పవిత్ర సహజ పుట్టినిల్లుగా చూసుకోవడం మనందరి కనీస కర్తవ్యం. నదుల పరిరక్షణతో సుస్థిరాభివృద్ధి ముడిపడి ఉంటుంది. ప్రపంచ మానవాళి ఐక్యతతో మానవ హారం పడితేనే నదుల పునర్వైభవం సుసాధ్యం అవుతుంది. నదుల పరిరక్షణ అంటే మానవాళినా మనుగడను కాపాడుకోవడమే అని భావించాలి. కాలుష్య నదీ జలాలు మానవ, జీవకోటి ఉనికికే పెను ప్రమాదాలని గుర్తుంచుకోవాలి. అంతర్జాతీయ నదుల పరిరక్షణ చర్యల దినం వేదికగా నదీ జలాల శుద్ధి, అక్రమ డ్యామ్‌ల నిర్మాణాలను వ్యతిరేకించడం, విద్యాలయాల్లో అవగాహన కార్యక్రమాలు, నదుల అంశంలో పోటీల నిర్వహణ, సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు లాంటివి పెద్ద ఎత్తున నిర్వహించి రాబోయే తరానికి సరైన తాగు నీటి వనరులను అమూల్య బహుమతులుగా అందిద్దాం, నదీమతల్లులకు నిత్యం ప్రణమిల్లుదాం.

# ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ...

- మొదటి పేజి తరువాయి
విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రిబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రిబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ-63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ-64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

# ఏపీలో రూ.47 కోట్ల విలువైన డ్రగ్స్ పట్టివేత

- మొదటి పేజి తరువాయి
గుట్టు రట్టు చేసింది. 'ఆపరేషన్ వైట్ హ్యామర్' అనే కోడ్‌నేమ్‌తో మార్చి 11, 12 తేదీల్లో నిర్వహించిన ఈ మెరుపు దాడుల్లో సుమారు రూ.47 కోట్ల విలువైన 237 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు కీలక నిందితులను అరెస్ట్ చేసింది.

పక్కా ఇంటెలిజెన్స్ సమాచారంతో డీఆర్ఐ అధికారులు ఈ ఆపరేషన్ చేపట్టారు. రసాయనాల తయారీ యూనిట్ ముసుగులో పూర్తిస్థాయి పారిశ్రామిక వసతులతో అల్ప్రజోలం తయారీ కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో జరిపిన సోదాల్లో రూ.47 కోట్ల విలువైన 237 కిలోల అల్ప్రజోలంతో పాటు, 800 కిలోలకు పైగా కీలక ముడి పదార్థాలు, 2,860 లీటర్ల వివిధ రసాయనాలు స్వాధీనం చేసుకున్నారు. దీంతో పాటు రియాక్టర్లు, డ్రైయర్లు, సెంట్రిఫ్యూజ్ వంటి భారీ పారిశ్రామిక పరికరాలను సీజ్ చేసినట్లు డీఆర్ఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఇది వ్యవస్థీకృతంగా, పెద్ద ఎత్తున జరుగుతున్న అక్రమ తయారీ కేంద్రమని అధికారులు నిర్ధారించారు.ప్రాథమిక విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. రసాయన, ఫార్మా రంగంలో 20 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఓ కెమిస్ట్ ఈ అక్రమ దందాకు సూత్రధారిగా వ్యవహరించినట్లు తేలింది. అతడికి మరో వ్యక్తి సహకరిస్తూ హైదరాబాద్‌లో ముడి పదార్థాల సేకరణ, తయారైన డ్రగ్స్ పంపిణీ బాధ్యతలను

చూసుకునేవాడు. వీరిద్దరూ అల్ప్రజోలం అక్రమ తయారీ కోసమే ఈ ఫ్యాక్టరీని అద్దెకు తీసుకున్నారని అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఈ ఇద్దరు సూత్రధారులను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'నషా ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా డీఆర్ఐ తన నిఘాను పటిష్ఠం చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా ఎనిమిది రహస్య డ్రగ్ తయారీ కేంద్రాలను ఛేదించినట్లు అధికారులు తెలిపారు. మాదకద్రవ్యాల ముప్పు నుంచి సమాజాన్ని కాపాడేందుకు కట్టుబడి ఉన్నామని డీఆర్ఐ పునరుద్ఘాటించింది.

# ఎల్‌పీజీ కొరత.. గ్యాస్ గోడౌన్ల వద్ద బారులు

- మొదటి పేజి తరువాయి
జనగాం జిల్లా రఘునాథపల్లిలో వంట గ్యాస్ కోసం ప్రజలు సిలిండర్లతో బారులు తీరారు. మూడు రోజుల క్రితం గ్యాస్ బుక్ చేసుకున్నప్పటికీ రాలేదని వరుసలో నిలబడిన వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## పిఠాపురంలో ఫ్లెక్సీ చిచ్చు...

- మొదటి పేజి తరువాయి
టీడీపీ నాయకులపై వర్మ మండిపడ్డారు. ముఖ్యమంత్రి ఫొటో గురించి ముందే చూసుకోవాలి కదా... పార్టీలో ఉంటూ ఏం చేస్తున్నారు? అంటూ ఆగ్రహం వెలిబుచ్చారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్న నాయకుడి ఫొటో రెవెన్యూ స్టాంప్ అంత చిన్నదిగా వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని పార్టీలకు అతీతంగా అందరూ గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. మొన్న సంక్రాంతి సంబరాల్లోనూ ఇలాగే జరిగిందని అన్నారు. దాదాపు ఐదారుసార్లు ఇటువంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని తెలిపారు. ఇవాళ పారిశుద్ధ్య కార్మికుల శిక్షణ కార్యక్రమంలో తాను వేదిక ఎక్కినా, కార్యకర్తలు ఊరుకోలేదని వర్మ వెల్లడించారు.

# అమరావతిలో బిట్స్ పిలానీ ఏఐ క్యాంపస్..

- మొదటి పేజి తరువాయి
పెట్టుబడి పెట్టనున్నట్లు వెల్లడించారు. దేశంలోనే తొలి ఏఐ క్యాంపస్‌గా దీనిని తీర్చిదిద్దుతున్నామని, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు అనుగుణంగా అత్యాధునిక టెక్నాలజీతో దీనిని నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు.క్యాంపస్‌లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్, రోబోటిక్స్ వంటి కోర్సులతో పాటు వ్యవసాయం, వాతావరణం, ఆరోగ్య సంరక్షణకు సంబంధించిన కోర్సులను కూడా ప్రవేశపెట్టనున్నట్లు వివరించారు. పర్యావరణహితంగా గ్రీన్ బిల్డింగ్, పునరుత్పాదక ఇంధన విధానాలతో నిర్మాణం చేపడుతున్నామని, పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని తెలిపారు. ప్లాన్లను పరిశీలించిన మంత్రి లోకేశ్ సంతృప్తి వ్యక్తం చేశారు. క్యాంపస్ నిర్మాణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి ప్రారంభించాలని వారికి సూచించారు.

# బడి భోజనంలో తేడాలొస్తే కఠిన చర్యలు

- మొదటి పేజి తరువాయి
జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పథకం అమలులో పారదర్శకత, నాణ్యత పెంచేందుకు మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భోజనం సిద్ధమయ్యాక, విద్యార్థులకు వడ్డించడానికి ముందుగా ప్రతిరోజూ ఒక టీచర్ తప్పనిసరిగా రుచి చూడాలని, నాణ్యతను నిర్ధారించాలని స్పష్టం చేశారు. పథకంలో సమూల మార్పుల కోసం, రాష్ట్రవ్యాప్తంగా యుద్ధ ప్రాతిపదికన సెంట్రలైజ్డ్ కిచెన్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచేందుకు, ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. వారానికి ఒకరోజు స్థానిక ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గంలోని ఏదో ఒక పాఠశాలను సందర్శించి, పిల్లలతో కలిసి భోజనం చేయాలని కోరారు. దీనివల్ల లోటుపాట్లుంటే వెంటనే సరిదిద్దుకోవడానికి వీలవుతుందని అభిప్రాయపడ్డారు. భోజనం నాణ్యతపై తల్లిదండ్రులు తమ అభిప్రాయాలను, ఫిర్యాదులను నేరుగా 'లీప్' యాప్ ద్వారా తెలియజేయవచ్చని లోకేశ్ విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత లేదా రాజకీయ ప్రయోజనాల కోసం పథకంపై ఉద్దేశపూర్వకంగా తప్పుడు ప్రచారం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

# హిడ్మాను చిత్రహింసలకు గురి చేసి చంపేశారు

- మొదటి పేజి తరువాయి
పోలీసుల ట్రాప్‌లో పడి ఆయన ప్రాణాలు కోల్పోయారని దేవ్‌జీ అన్నారు. హిడ్మాది వంద శాతం బూటకపు ఎన్‌కౌంటర్ అని, ఆయనను చిత్రహింసలకు గురిచేసి చంపేశారని ఆయన ఆరోపించారు. 'ఆపరేషన్ కగార్' సమయంలో బస్వరాజు చేసిన విజ్ఞప్తిని కేంద్రం పట్టించుకోకపోవడం వల్లే ప్రతిఘటన అనివార్యమైందని, ఆ పోరాటంలోనే బస్వరాజును కోల్పోయామని వెల్లడించారు. మరోవైపు, అగ్రనేత గణపతి గురించి స్పందిస్తూ.. 2023లో జరిగిన కేంద్ర కమిటీ సమావేశంలో ఆయనను చివరిసారిగా చూశానని, ఆ తర్వాత ఆయనతో సంబంధాలు లేవని దేవ్‌జీ స్పష్టం చేశారు. సమాజంలో దోపిడీ రూపం మార్చుకుందే తప్ప తొలగిపోలేదని... దోపిడీ ఉన్నంత కాలం ఉద్యమం కొనసాగుతుందని ఆయన వ్యాఖ్యానించారు. మావోయిస్టు పార్టీపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో ఉన్న వారిని రాజకీయ ఖైదీలుగా గుర్తించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాజకీయ పదవుల కోసం తాను ఎన్నికల్లో పోటీ చేయబోనని, చట్టం పరిధిలోనే ఉండి ప్రజా సమస్యలపై పోరాడతానని దేవ్‌జీ ప్రకటించారు.

## ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు

- మొదటి పేజి తరువాయి
పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.

ప్రస్తుతం ఈ ఘటనలో ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

# వారిని అంతం చేస్తున్నా

- మొదటి పేజి తరువాయి
హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు.

ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

# ఏపీ ప్రభుత్వంపై మరోసారి తీవ్ర విమర్శలు గుప్పించిన పేర్ని నాని

- మొదటి పేజి తరువాయి
అభివర్ణించిన పేర్ని నాని, ప్రభుత్వం అప్పుల విషయంలో పచ్చి అబద్ధాలు చెబుతోందని ఆరోపించారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ పక్కా ఆధారాలతో నిజాలు మాట్లాడారని, వాటిని అబద్ధమని నిరూపించే దమ్ము ప్రభుత్వానికి ఉందా అని సవాల్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వం రూ. 3.27 లక్షల కోట్ల అప్పు చేసినట్లు జీవోలు ఉన్నాయని, కానీ అప్పులు కేవలం లక్ష కోట్లేనని తప్పుడు లెక్కలు చెబుతున్నారని మండిపడ్డారు. ఈ లెక్కలపై వారం రోజుల్లోగా స్పష్టత ఇవ్వాలని ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని డిమాండ్ చేశారు. తప్పుడు లెక్కలపై కేంద్రానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

రాష్ట్రంలో మహిళలపై అకృత్యాలు పెరుగుతున్నాయని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మహిళను వేధిస్తే చర్యలు తీసుకోకపోగా, తిరిగి ఆమెపైనే కేసులు పెట్టడం దుర్మార్గమని విమర్శించారు. మహిళలను వేధిస్తే అదే వారికి చివరి రోజు అన్న చంద్రబాబు మాటలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. అలాగే హాస్టళ్లలో పిల్లలకు సరైన భోజనం అందడం లేదని, మైలవరం స్కూల్ ఘటనలే అందుకు నిదర్శనమని పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ ప్రత్యేక విమానాల్లో విదేశాలకు వెళ్లి క్రికెట్ చూస్తున్నారని, ఆయనకు విద్యార్థుల కష్టాలు పట్టడం లేదని అన్నారు. హెరిటేజ్ సంస్థ అప్‌గ్రేడ్ కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలంట అంటూ ధ్వజమెత్తారు. కరెంటు బిల్లుల్లో కూడా రాయితీలు కల్పిస్తున్నారని పేర్ని నాని ఆరోపించారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు నియామకంపై కూడా ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అక్రమ సంబంధాల ఆరోపణలు ఉన్న వ్యక్తికి పవిత్రమైన టీటీడీ పదవి ఎలా ఇస్తారని నిలదీశారు.

# ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత

- మొదటి పేజి తరువాయి
చేయించుకుని ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత ఆయన బాత్రూంలో పడిపోయినట్టు తెలుస్తోంది. హెచ్‌జే దొర తీవ్ర అస్వస్థతకు గురికావడంతో కుటుంబ సభ్యులు నిమ్స్ కు తరలించారు. అత్యవసర చికిత్స అందించినప్పటికీ డాక్టర్ల ప్రయత్నాలు ఫలించలేదు. 1965 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన హెచ్‌జే దొర శ్రీకాకుళం జిల్లాకు చెందినవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో డీజీపీగా, హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా ఆయన విశేష సేవలు అందించారు. ముఖ్యంగా, రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాదాన్ని (నక్సలిజం) అణచివేయడంలో కీలక పాత్ర పోషించి గుర్తింపు పొందారు. సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌గా,

సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ జాతీయ స్థాయిలో పలు ఉన్నత పదవులు చేపట్టారు. దొర 1996లో డీజీపీగా ప్రమోషన్ పొందారు. ఆయన తన సుదీర్ఘ వృత్తి జీవితానుభవాలతో 'జర్నీ త్రూ టర్బ్యులెంట్ టైమ్స్' పేరుతో ఆత్మకథను కూడా రచించారు.

# అందరినీ సంపూర్ణ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే అక్షరాంధ్ర ప్రధాన లక్ష్యం ఎంపీడీఓ రాజేశ్వర్ రావు



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 13:**అంగన్వాడీ టీచర్స్ వీవోఏ లు అందరితో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో జరుగు అక్షరాంధ్ర (ఉల్లాస్) అభ్యాసకులకు నిర్వహించే ఫైనల్ ఎగ్జామ్స్ లో తీసుకోవలసిన సూచనలు, విధి విధానాలు తెలియజేయడం జరిగింది. మరియు ఎగ్జామ్ మెటీరియల్ అందజేయడం జరిగింది.సదరు కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేశ్వర్ రావు, డిప్యూటీ ఎంపీడీఓ సూర్య నారాయణ రాజు, ఏపీఎం శ్రీనివాస్ రాజు, ఏపీవో చంద్రమోహన్, అంగన్వాడీ టీచర్స్, వివో ఏలు పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# అన్నదాతకు ఆర్థిక భరోసా!





- రూ.14.9 కోట్లు 24,137 రైతు కుటుంబాలకు అన్నదాత సుఖీభవ
- పీఎం కిసాన్ నిధులు

**కె.గంగవరం, పెన్ పవర్,మార్చి 13:**వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ తెలిపారు. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగవరం మండలం దంగేరు గ్రామంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్,కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మొత్తం రూ.14.9 కోట్ల నిధులను 24,137 మంది రైతు కుటుంబా లకు అందజేశారు.

**రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్**

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం రైతులకు అన్నదాత సుఖీభవపీఎం కిసాన్ నిధులు పంపిణీ చేయడం ప్రభుత్వం నిబద్ధతను చాటుతోందన్నారు. రైతు కుటుంబాలు సంతోషంగా ఉండటం, వారి కళ్లలో ఆనందం చూడడమే ప్రభుత్వ అసలు ధ్యేయమన్నారు. రైతులు ఈ నిధులను వ్యవసాయ పెట్టుబడులుగా వినియోగించి పంటల ఉత్పత్తిని పెంచాలని సూచించారు. వ్యవసాయ రంగం బలోపేతం కావడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మరింత బలపడుతుందని తెలిపారు.

**రైతు సంక్షేమానికి ప్రభుత్వం అంకితభావంతో పనిచేస్తోంది వాసంశెట్టి సత్యం**

కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కృషితో నియోజకవర్గంలో రైతులకు అనేక సంక్షేమ కార్యక్రమాలు అందుతున్నాయని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందన్నారు. ప్రకృతి వ్యవసాయానికి ప్రాధాన్యత ఇస్తూ రైతులు పర్యావరణానికి అనుకూలమైన పద్ధతుల్లో సాగు చేయాలని సూచించారు. రైతాంగం బలపడితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్ మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతన్నను ఆదుకునేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతులకు ఆర్థిక వెన్నుదన్నుగా మార్కెట్ యార్డులను తీర్చిదిద్దుతున్నామని అన్నారు. గత ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

జనసేన ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రైతు కుటుంబాల్లో ఆనందం నింపేందుకు ప్రభుత్వం మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాలను అమలు చేయడం పట్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున, వ్యవసాయ శాఖ ఏడి నాగకుమార్, ఏవోలు మణిదీప్, సద్గురుమూర్తి, స్వచ్ఛాంధ్ర డైరెక్టర్ సలాది రమేష్, ఏఎంసీ డైరెక్టర్లు, ఎంపీపీ నాగమణి, కూటమి పార్టీ నాయకులు మరియు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.

# ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం



**అల్లవరం,పెన్ పవర్,మార్చి 13:**అల్లవరం మండల పరిషత్ కార్యాలయం నందు ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అధ్యక్షతన సర్వసభ్య సమావేశంనిర్వహించారు.ఈసమావేశం లో ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు పై అధికారులు వివరించాలని కోరారు.పంచాయతీ రాజ్ ఆధ్వర్యంలో ప్రతి గ్రామానికి 50 లక్షలు నిధులు తో గ్రామాల అభివృద్ధి చేయడం జరుగుతుంది అని పంచాయతీ రాజ్ అధికారి సమావేశం లో వివరించారు. అల్లవరం ఎంపీటీసీ సభ్యురాలు నిచ్చనకోళ్ల మౌనిక మాట్లాడుతూ గ్రామాల్లో పంచాయతీ రాజ్ అధికారులు చేస్తున్న అభివృద్ధి గురించి మాకు సమాచారం లేదని మాకు తెలియపరచాలని చెప్పారు.గృహ నిర్మాణ శాఖ లో ఎటువంటి గృహాలు మంజూరు కాలేదని సర్వే చేసి గృహాలపై నివేదికను పంపించమని త్వరలో నిధులు ఆమోదం అయ్యే అవకాశం ఉందని చెప్పారు.డ్రైన్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ సునీత మాట్లాడుతూ పలు డ్రైన్ మరమ్మతులు చేపట్టామని వివరించారు.ఆక్వా చెరువులు సాగు చేస్తున్న రైతులు సజ్జ డ్రైన్ లోకి తోడేస్తున్నారని మీరు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నించారు.తమ దృష్టికి వచ్చిన ఫిర్యాదులను బట్టి నోటీస్ లు ఇచ్చామని అన్నారు. తహసీల్దార్ నరసింహ రావు మాట్లాడుతూ కొత్తగా రేషన్ కార్డు లు దరఖాస్తు చేసుకోవాలన్నవారు దరఖాస్తు చేసుకోవాలని , యాడింగ్ చేసుకోవాల్సిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు అని సూచించారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారి సుస్వర మాట్లాడుతు బెండమూరులంక హాస్పిటల్ లో 31 మందికి వైద్య పరీక్షలు చేయగా ఒక క్యాన్సర్ గా నిర్ధారణ అయ్యిందని తెలిపారు.విద్యా శాఖ అధికారి మాట్లాడుతూ పదవతరగతి పరీక్ష మండలంలో 590 మంది విద్యార్థులు పరీక్షకు హారవుతున్నారని అని ,అల్లవరం,కొమరగిరిపట్నం దేవగుప్తం పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని అన్నారు. సర్పంచ్ ల పదవి కాలం ఏప్రిల్ 2 తో ముగియనుండడం తో సర్పంచ్ లకు ఘన సత్కారం ఎంపీపీ,జడ్పీటీసీ,వైస్ ఎంపీపీ, ఎంపీటీసీ లు చేతులు మీదగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కొనుకు గౌతమి,వైస్ ఎంపీపి లు వడ్డీ గంగ,ముత్యాల రామకృష్ణ ,ఎంపిడిఓ గౌరీ కుమారి ,సర్పంచ్ లు ,ఎంపీటీసీ.సబ్యులు,అధికారులు,పాల్గొన్నారు.

# ఆదివారం ఆలమూరు జనార్ధనస్వామివారికి విశేష తులసీ దళార్చన



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**ఈ నెల 15వ తేదీ ఆదివారం


ఏకాదశి (తత్కాల ద్వాదశి ), శ్రవణా నక్షత్రం సందర్భంగా ఆలమూరులో వేంచేసి ఉన్న నారద ప్రతిష్టిత శ్రీ జనార్ధన స్వామి దేవస్థానంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ వారి ఆధ్వర్యంలో వైభవోపేతంగా విశేష తులసీ దళార్చన జరగనుంది. విష్వక్సేనపూజ,పుణ్యాహవచనం మండపారాధన, స్వామివారి కౌతుక బేరమునకు స్నపన తిరుమంజనం అనంతరం విశేషతులసీ అర్చన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థ ప్రసాద వితరణ జరుగుతాయని, అనంతరం శ్రీ స్వామివారికి విశ్వశాంతి కోసం శాంతి హోమం పూర్ణాహుతి జరుపబడుతుందని ఈవో నరేంద్రకుమార్, పాలకమండలి చైర్మన్ బైరిశెట్టి రాంబాబు,అర్చకులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

# కాకినాడ జిల్లాలో రైతులకు రూ.84.80 కోట్లు జమ

- 1,50,475 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ లబ్ధి
- హార్టికల్చర్ పంటలు, ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలి
- కలెక్టర్ షణ్మోహన్

**కాకినాడ, పెన్ పవర్,మార్చి 13:**కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకాల కింద కాకినాడ జిల్లాలోని రైతులకు గణనీయమైన ఆర్థిక సహాయం జమ చేసినట్లు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి తెలిపారు. జిల్లాలో మొత్తం 1,50,475 మంది రైతుల ఖాతాల్లో రూ.84.80 కోట్లు జమ అయినట్లు ఆయన వెల్లడించారు.శుక్రవారం పెదపూడి మండలం కరకుదురు గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం మూడో విడత ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని రైతులతో కలిసి జిల్లా కలెక్టర్ వీక్షించారు. ఈ సందర్భంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను ప్రత్యక్ష ప్రసారంగా ప్రదర్శించారు. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రైతుల ఖాతాల్లో నిధులు నేరుగా జమ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన ఈ ఆర్థిక సహాయం రబీ సీజన్‌లో రైతులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సహాయం పూర్తిగా పారదర్శకంగా రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా జమ అవుతోందన్నారు. జిల్లాలో రైతులు భవిష్యత్తులో హార్టికల్చర్ పంటల సాగు, ప్రకృతి వ్యవసాయంపై ఎక్కువగా దృష్టి సారించాలని సూచించారు. ఇందుకు అవసరమైన సహాయ సహకారాలు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు.

జిల్లా వ్యాప్తంగా అన్నదాత సుఖీభవ పథకం కింద 1,50,475 మంది రైతులకు రూ.60.18 కోట్లు, పీఎం కిసాన్ యోజన కింద 1,23,045 మంది రైతులకు రూ.24.61 కోట్లు జమ కాగా,మొత్తం రూ.84.80 కోట్ల ఆర్థిక సహాయం రైతులకు అందినట్లు తెలిపారు. కరకుదురు గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో 553 మంది రైతులకు ఈ రెండు పథకాల ద్వారా లబ్ధి చేకూరింది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడిఏ కె.దుర్గాలక్ష్మి,వ్యవసాయ అధికారి ఎన్. సత్యప్రసాద్, పెదపూడి తహసీల్దార్ పీవీ సీతాపతి రావు,ఎంపీడీవో నరేంద్ర రెడ్డి, డీసీసీ చైర్మన్ సానా శ్రీనివాసరావు, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ సింగినీడి నాగ తిరుపతిరావు, బీజేపీ నాయకులు తోటకూర వెంకటేశ్వరరావు, జనసేన ప్రతినిధులు పాఠంశెట్టి కాశీరాణి, పాఠంశెట్టి త్రిమూర్తులు, వీఏఏ ఎండీ అఫ్జల్ హుస్సేన్, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ప్రజల పక్షాన నిలబడిన కొట్లాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్

- కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 13:** జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర నిర్వహించారు. ముందుగా షర్మిల రెడ్డి రాజమహేంద్రవరం నుంచి రోడ్డు మార్గంలో జగ్గంపేట చేరుకుని జగ్గంపేట సెంటర్లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అక్కడి నుంచి కాట్రావులపల్లి చేరుకుని రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం సూపర్ సిక్స్ పథకాలు హామీ ఇచ్చారని అందులో ఎన్ని అమలవుతున్నాయని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి ఇవ్వలేదని, మహిళలకు మహాశక్తి పథకం ఇస్తానని మోసం చేశారన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడుతున్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. పార్లమెంటులో జనసేన, టీడీపీ, వైసీపీ ఎంపీలు ఉన్నా సరే కానీ పోలవరం ప్రాజెక్టుని ఎందుకు ఖూనీ చేస్తున్నారని మాట్లాడే ఒక్క మగాడు లేడని విమర్శించారు. ఎంత మంది ఎంపీలు ఉన్నా బీజేపీకే ఊడిగం చేస్తున్నారన్నారు. అన్ని రాష్ట్రాలకు రాజధానులు ఉన్నాయని మన రాష్ట్రానికి రాజధాని లేదని చేతిలో చిప్ప ఉందన్నారు. రాజధాని లేని రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు. చంద్రబాబు, జగన్ ముఖ్యమంత్రి అయ్యారే కానీ రాజధాని రాలేదన్నారు. ఉపాధి హామీ పథకం నిర్వీర్యమైపోయిందన్నారు. ఉపాధి హామీ పథకం పేరు మార్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులను పక్కదారి మళ్ళిస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో మాజీ కేంద్ర మంత్రి ఎం ఎం పల్లంరాజు, డిసిసి అధ్యక్షులు మాదేపల్లి సత్యానందరావు, జగ్గంపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మరోతి శివ గణేష్, ఏఐసీసీ సభ్యులు మల్లిపూడి రాంబాబు, పిసిసి సభ్యులు శ్రీ వత్సవాయి సత్యనారాయణ రాజు అనే బాబు, ఏపిసిసి జనరల్ సెక్రెటరీ డాక్టర్ నక్క సత్యనారాయణ, పిసిసి ఉపాధ్యక్షులు మట్టా ప్రసాద్, రాష్ట్ర కిసాన్ సెల్ అధ్యక్షులు కామన ప్రభాకర్ రావు, కాకినాడ సిటీ కాంగ్రెస్ అధ్యక్షులు చెక్క నూకరాజు, పెద్దాపురం కాకినాడ రూరల్ ఇన్చార్జిలు మొలకల సూరిబాబు పిల్లి లక్ష్మి చిన్నా, పిసిసి ఉపాధ్యక్షులు మార్టిన్ లూథర్, పులివెందుల ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి, బ్లాక్ వన్ అధ్యక్షులు చంద్రమౌళి వెంకటరత్నం అనే చిన్నారి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు గొంప కొండబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## అక్షరాస్యత పెంపే లక్ష్యం: ఎంపీడీవో బి కె ఎస్ ఎస్ వి రామన్






**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 13 :**రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "అక్షర ఆంధ్ర" కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో అక్షరాస్యతను పెంపొందించడం, వయోజన విద్యను ప్రోత్సహించడం ప్రధాన లక్ష్యమని ఆత్రేయపురం ఎంపీడీవో బి.కె.ఎస్.ఎస్. వెంకట రామన్ తెలిపారు.మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ టీచర్లు, వి.ఓ.ఏలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 15న నిర్వహించనున్న అక్షర ఆంధ్ర పరీక్షను విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన సూచనలు, మార్గదర్శకాలు అందించారు. గ్రామాల్లో ప్రజలకు విద్యా అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని సూచించారు.సమావేశంలో ఏపీవో ఆర్.యం.డి. గంగాధర్, ఏపీఎం సి.హెచ్. విజయరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, వి.ఓ.ఏలు పాల్గొన్నారు.

## నదీ కోత నివారణకు చర్యలు: ఎమ్మెల్యే బండారు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 13:**ఆత్రేయపురం మండలం రాజవరంలో గోదావరి నదీ కోతకు గురవుతున్న లంక పొలాలను శుక్రవారం కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. గతంలో జరిగిన మట్టి తవ్వకాల వల్ల నేల వదులై పొలాలు గోదావరిలో కలిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నదీ కోతను అరికట్టేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రోయిన్ల నిర్మాణానికి సుమారు రూ.38.50 కోట్లు అవసరమని అధికారులు తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు, సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ప్రతిపాదనలు ఆమోదం పొందగానే గ్రోయన్ల నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు.

## సీఐ తిరుపతిరావును కలిసిన గండేపల్లి మండల నాయకులు



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 13**: జగ్గంపేట సర్కిల్ ఇన్ స్పెక్టర్ గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిరావును శుక్రవారం జగ్గంపేట సర్కిల్ కార్యాలయం వద్ద గండేపల్లి జడ్పిటిసి పరిమిబాబు, గండేపల్లి మండల తెలుగు యువత అధ్యక్షులు సుంకవల్లి రమేష్, పైపూరి సారంగబాబు, బొగత నూకరాజు, గుర్రాల చిన్ని శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా సీఐ తిరుపతిరావును సాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో గండేపల్లి, కిర్లంపూడి ఎస్సైగా విధులు నిర్వహించిన తిరుపతిరావు అందరితో స్నేహభావంతో మెలుగుతూ ఎవరికి ఎటువంటి ఇబ్బందులు వచ్చినా వాటిని సరి చేస్తూ విధులు నిర్వహించే వారిని ఇటువంటి వ్యక్తి మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని కోరుకుంటున్నామని తెలిపారు.

# ర్యాలి దేవస్థానంలో ప్రతిష్ఠ మహోత్సవాలు





**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 13 :**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వేంచేసియున్న శ్రీ జగన్మోహిని కేశవ, గోపాల స్వామివారి దేవస్థానంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ జగన్మోహిని కేశవ స్వామివారి పంచలోహ విగ్రహాలకు త్రయాహ్నిక దీక్షతో ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ మహోత్సవాలను తల్లాప్రగడ విశ్వేశ్వరరావు, సునీత దంపతులు నిర్వహిస్తున్నారు.
కార్యక్రమంలో భాగంగా శుక్రవారం విశ్వక్సేనపూజ,పుణ్యాహవచనం, సప్త కలశారాధన, నవ కలశారాధన, అక్షిమోచనం, క్షీరాధివాసం, జలాధివాసం, ప్రధాన శాంతి హోమాలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం, పంచశయ్యాధివాసం కార్యక్రమాలు జరిగాయి.
ఈ కార్యక్రమంలో ఈవో బి వెంకటరమణమూర్తి, ఆలయ ఛైర్మన్ మెర్ల నాగేశ్వరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ అర్చకులు వాడపల్లి శేషాచార్యులు, ఖండవల్లి సీతారామాచార్యులు, వేదపండితులు, వెంకట అవధాని సిబ్బంది, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్యవటం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేత

**కాజులూరు, పెన్ పవర్,మార్చి 13:**ఆర్యవటం 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహించనున్న మరమ్మతుల పనుల కారణంగా శనివారం (14-03-2026) ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎలక్ట్రికల్ ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ తెలిపారు.ఈ మేరకు 11 కేవీ ఫీడర్ల పరిధిలోని ఆర్యవటం, గొల్లపాలెం, బందనపూడి, మొగలి పాలెం, శలపాక, తనుకువాడ, శీల, ఒంటితాడి, మంజేరు, టి. మామిడాడ, గొర్రిపూడి, పెనుమల్ల, అంద్రంగి, తనుమల్ల, పెడపాటి గరువు, పెద్దాపురప్పాడు, యండమూరు, విజయ రాయుడుపాలెం, జగన్నాధగిరి గ్రామాల గృహ విద్యుత్ వినియోగదారులకు, అలాగే ఆక్వా మరియు పరిశ్రమల ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు.విద్యుత్ మరమ్మతుల పనులు పూర్తయ్యిన వెంటనే సరఫరాపునరుద్ధరించబడుతుందని పేర్కొంటూ, వినియోగదారులు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. ఉదయ భాస్కర్ విజ్ఞప్తి చేశారు.

## మావుళ్ళమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 13:**కాట్రేనికోన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ మావుళ్ళమ్మ తల్లి అమ్మవారికి శుక్రవారం సందర్భంగా పూల మాలలతో విశేషాలంకరణ చేశారు.ఆలయ ప్రధాన అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్ శాస్త్రి ఆధ్వర్యంలో తొలిత విగ్నేశ్వరుని పూజ,అమ్మ వారికి అభిషేకం మరియు శ్రీ సూక్త విధానంగా సహస్రనామ కుంకుమార్చన,ధూప దీప నైవేద్యాలు సమర్పించారు.
అనంతరం నీరాజనం మంత్రపుష్పాలు,వేద స్వస్తి జరిపారు.ఈ సందర్భంగా మహిళలచే సామూహికంగా లలితా సహస్ర పారాయణశీ చేశారు.అలాగే ఆలయ ఆవరణలో గల వినాయకుడు,షిరిడి సాయిబాబా వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేదుల శ్రీనివాస్,కోట ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ జరిగింది.
అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మ వారికి జరిగిన పూజా విధానాలను తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.
ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆణివిళ్ళ సాయిబాబా,ఆణివిళ్ళ రామకృష్ణ పరమహంస, ఆణివిళ్ళ పవన్,వేదుల శ్రీను,ఆకొండి శ్రీకాంత్,తాతపూడి పండు,
సంసాని పాండురంగా రావు,
విత్తనాల నరసింహా రావు, సానబోయిన సూరిబాబు,సంసాని వర ప్రసాద్,చెరుకు బాపిరాజు, సంసాని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.ప్రతి శుక్రవారం సాయంత్రం ఏడు గంటలకు అమ్మవారికి పల్లకి సేవ కార్యక్రమం చేయడం జరుగుతోంది.
ఆలయం చుట్టూ 11 ప్రదక్షణాలతో అమ్మవారికి ధూప సేవా కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

## ఆదిత్య విశ్వవిద్యాలయం ఫోరెన్సిక్ విభాగం లో ఘనంగా గా ప్రారంభమైన అంతర్జాతీయ సదస్సు"





**గండేపల్లి, పెన్ పవర్,మార్చి ,13:**ఆదిత్య యూనివర్సిటీలో నిర్వహిస్తున్న ఫోరెన్సిక్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ మరియు డిజిటల్ ఫోరెన్సిక్స్ పై తొలి అంతర్జాతీయ సదస్సు మొదటి రోజు కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడింది.
ఈ సదస్సులో దేశ విదేశాల నుండి 500 పైగా నిపుణులు, అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.
సదస్సును ఆదిత్య యూనివర్సిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డా. ఎం. శ్రీనివాస రెడ్డి మరియు వైస్ చాన్సలర్ డా. ఎం. బి. శ్రీనివాస్ సమక్షంలో ప్రారంభించారు.
ఇండియా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ లీగల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్, గోవా వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డా. ఆర్. వెంకట రావు " ఫ్రొమ్ క్రెసీస్ ఆఫ్ కాంఫిడెన్స్ టూ రెస్టోరేషన్ ఆఫ్ ట్రస్ట్: "టెక్నాలజీ అస్ ఆన్ ఇనాభిలార్ ఇన్ మోడరన్ క్రిమినల్ జస్టిస్ అండ్ ఇన్వెస్టిగేషన్స్ " అనే అంశంపై ముఖ్య ఉపన్యాసం ఇచ్చారు. ఆధునిక నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతను ఆయన వివరించారు.
ఇటలీకి చెందిన ఆంఫీడ్ సాఫ్ట్వేర్ సంస్థకు చెందిన ఫోరెన్సిక్ నిపుణుడు శ్రీ రామ్ ధనబాలన్ "డీప్ ఫేక్ ఫోరెన్సిక్స్ అండ్ ఏఐ: అనలైజింగ్ డిజిటల్ రిస్క్ ఆలాంగ్ సైడ్ ఆంఫీడ్ ప్రోడక్ట్ క్యాపబిలిటీస్ " అనే అంశంపై ప్రసంగించి డీప్‌ఫేక్ టెక్నాలజీ వల్ల కలిగే ప్రమాదాలు మరియు వాటిని గుర్తించే ఫోరెన్సిక్ సాంకేతిక పద్ధతులను వివరించారు.
యూకేలోని నాటింగ్హామ్ ట్రెంట్ యూనివర్సిటీకి చెందిన ఫోరెన్సిక్ సైన్స్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. రాచెల్ బోల్టన్-కింగ్ "ది ఫ్యూచర్ అఫ్ ఫోరెన్సిక్ సైన్స్ : ఇంటలిజెన్స్ – లెడ్ ఇన్వెస్టిగేషన్స్, గ్లోబల్ క్వాంటిటీ స్టాండర్డ్స్, అండ్ ది నెక్స్ట్ జనరేషన్ వర్క్ఫోర్స్" అనే అంశంపై ప్రసంగించారు.
ఈ సదస్సులో పరిశోధన పత్రాల ప్రదర్శనలు, సాంకేతిక సెషన్లు నిర్వహించబడగా, విద్యార్థులు మరియు పరిశోధకులు తమ పరిశోధన ఫలితాలను ప్రదర్శించారు.
రేపు రెండవ రోజు కూడా నిపుణుల ఉపన్యాసాలు, సాంకేతిక చర్చలు మరియు పరిశోధన సెషన్లు కొనసగనున్నాయని ఆదిత్య యూనివర్సిటీ ఫోరెన్సిక్ సైన్స్ విభాగం అసోసియేట్ డీన్ విలాస్ అనిల్ చవాన్ అన్నారు.

## జగ్గంపేటలో కవయిత్రి మొల్ల జయంతి





**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 13**: జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చెన్నారావు ఆధ్వర్యంలో తెలుగు విభాగం ప్రముఖ తెలుగు కవయిత్రి మొల్ల జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ మొల్ల చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు.
ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చెన్నారావు మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో ప్రముఖ కవయిత్రిగా నిలిచారని, ఆమె రచించిన మొల్ల రామాయణం తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం పొందిందని తెలిపారు. మొల్ల తన సాహిత్యంతో మహిళల ప్రతిభను ప్రపందానికి పరిచయం చేసిన గొప్ప కవయిత్రి అని విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ సిహెచ్ బాలరాజు, ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# విత్తన గుళికల తయారీ పై రైతులకు అవగాహన

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**ఆలమూరు మండలం నర్సిపూడి గ్రామ పంచాయితీ వద్ద శుక్రవారం సేంద్రీయ వ్యవసాయ సిబ్బందితో విత్తన గుళికల తయారీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విత్తన గుళికల తయారీ విధానం, వాటి ఆవశ్యకత గురించి రైతులకు సేంద్రీయ వ్యవసాయ మండల ఎఫ్ఎంటి కర్రా సూర్య ప్రకాష్, ఐసిఆర్పి తోరాటి నాగ మహేశ్వరరావు వివరించారు. వర్షాధారిత ప్రాంతాల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు ఈ పద్ధతి ఎంతగానో ఉపయోగపడుతుందని, విత్తన గుళికలు మన పొలాల్లో వేసుకోవడం వల్ల అతి తక్కువ వర్షం, నీటి లభ్యత సమయంలో ఈ విత్తన గుళికలు ఎంతగానో ఉపయోగపడతాయని వారు పేర్కొన్నారు. ఘన జీవామృతం, బంకమట్టి, బూడిద, విత్తనాలతో వీటిని రూపొందించాలని సూచించారు.కార్యక్రమంలో దొంగ నాగసూర్యవతి, ఐసిఆర్పిలు దుర్గా ప్రకాష్, నాగదేవి, జ్యోతి, దివ్య, నాగబాబు, సత్యవేణి తదితరులు పాల్గొన్నారు.





## పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి జాతీయ పర్యావరణ మిత్ర గంగాధర్



**గండేపల్లి, పెన్ పవర్ , మార్చి 13**

సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీ ప్రెస్ రిలేషన్ ఆఫీసర్ శ్రీ శారదా రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్ తన శుక్రవారం పెళ్లిరోజు పురస్కరించుకొని మొక్కలు నాటి ఆదర్శంగా జరుపున్నారు.ఈ గంగాధర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమతమ పుట్టిన రోజు పెళ్లి రోజు తదితర ప్రత్యేక దినాలలో పర్యావరణ హితంగా మొక్కలు నాటడం అలవాటుగా చేసుకొని ప్రకృతి పరిరక్షణకు పాటుపడాలని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధించే విధంగా అవగాహన కల్పించాలని తద్వారా భావితరాలకు కాలుష్య రహిత పచ్చటి పర్యావరణాన్ని అందించడానికి కృషి చేయాలని కోరారు.మనం ఆచరించి చూపినప్పుడే ఇతరులకు చెప్పే అర్హత ఉంటుందని పుట్టిన రోజు పెళ్లి రోజు సందర్భంగా మొక్కలు నాటడం ఎంతో సంతృప్తిని ఇస్తుందని పెళ్లి రోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన అధికారులకు,మిత్రులకు,శ్రేయోభిలాషులందరికి కృతజ్ఞతలు తెలిజేస్తున్నాను అన్నారు. ఈ సందర్భంగా గంగాధర్ శ్రీమతి లక్ష్మీ దంపతులకు ఆదిత్య యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డా. ఎన్.సతీష్ రెడ్డి, డిప్యూటీ ప్రో చాన్సలర్ డా ఎం శ్రీ నివాస రెడ్డి, క్యాంపస్ ఇంచార్జ్ మేడపాటి భాస్కర చంద్రారెడ్డి, గంగాధర్ సోదరులు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తోటకూర సాయి రామకృష్ణ,ఆదిత్య సిబ్బంది గండేపల్లి మీడియా మిత్రులు శుభాకాంక్షలు తెలియజేసారు.

## ఇండియా కిక్ బాక్సింగ్ స్టేట్ లెవెల్ పోటీల్లో పథకాలు సాధించిన విద్యార్థులను అభినందించిన డాక్టర్ చల్లా, సలాది.



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**పంచ్ పడితే పథకం ఖాయం ఇటీవల జరిగిన అస్మిత కే లో ఇండియా కిక్ బాక్సింగ్ స్టేట్ లెవెల్ పోటీల్లో పథకాలు సాధించిన ఆలమూరు వారియర్ మాంక్స్ కుంగ్ ఫు విద్యార్థులు పలు పథకాలు సాధించినట్లు కోచ్ అండ్ మాస్టర్ లంకే వెంకటరెడ్డి తెలిపారు. ఈనెల 5వ తారీఖు నుంచి ఎనిమిదో తారీకు వరకు కర్ణాటక బెంగళూరులో నింజారా స్టేడియంలో జరిగిన సౌత్ ఇండియా నేషనల్ కిక్ బాక్సింగ్ పోటీల్లో ఆలమూరు వారియర్ మాంక్స్ కుంగ్ ఫు విద్యార్థులు 32కేజీల క్యాటగిరిలో జొన్నాడ శ్రీ సత్యం కాన్వెంటులో ఆరవ తరగతి చదువుతున్న కర్రి బాలశ్రీ నందిని బ్రాంజ్ మెడల్, 36కేజీల క్యాటగిరిలో రావులపాలెం శ్రీ నక్షత్ర స్కూల్లో చదువుతున్న తలాటం శ్రీమానస్వి బ్రాంజ్ మెడల్ సాధించినట్లు తెలిపారు. వీరు ఈనెల26 నుంచి 29 వరకు తమిళనాడు చెన్నైలో జరగబోయే కే లో ఇండియా నేషనల్ పోటీలకు అర్హత సాధించారు. వీరిని డాక్టర్ చల్లా ప్రభాకర్ రావు,కొత్తపేటకు చెందిన కాపు ఉద్యమ నాయకుడు సలాది రామకృష్ణ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు పథకాలు సాధించిన విద్యార్థులు రాబోయే కాలంలో జాతీయ స్థాయిలో బాగా రాణించాలని, మన ఆంధ్రప్రదేశ్ కి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు.అలాగే వారియర్ మాంక్స్ కుంగ్ ఫు ఫౌండర్ లంకే వెంకటరెడ్డి, సీనియర్ మాస్టర్ నార్గని సెంథిల్ కుమార్,అసిస్టెంట్ కోచ్ పి నానిబాబు,చింతా చిరంజీవి మల్లాడి శ్రీను, కళ్యాణ్, సురేష్ వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ఎలుగుబంటి సాయిబాబు,గొర్రిపూడి పెదకాపు, ఎలుగుబంటి బూరయ్య, ఎరుకొండ గణేష్, శ్రీపతి వీర్రాజు, వెత్సా శ్రీనివాసు,రావూరి శివ, గుబ్బల ప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వ హయంలో చింతలూరు నూకాలమ్మ ఆలయ అభివృద్ధి వేగవంతం

ఆలయంలో రూ.1.18 కోట్లతో నిర్మించిన రెండు రాజగోపురాలతో పాటు, వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు.

జాతరకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు తలెత్తకుండా తగిన ఏర్పాట్లు చేయాలి

సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**ఉభయగోదావరి జిల్లాలో అత్యంత ప్రముఖమైన చింతలూరు నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలకు లక్షలాదిగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదేశించారు. శుక్రవారం దేవస్థానంలో నూతనంగా నిర్మించిన రాజగోపురాలు, పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం, దేవస్థాన ప్రాంగణంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే బండారు, జనసేన ఇన్చార్జ్ బండారు శ్రీనివాస్, కొత్తపేట డిఎస్పీ సుంకర మురళి మోహన్, ఎంపీడీవో రాజు, ఎమ్మార్వో కేజే ప్రకాష్ బాబు తదితరులతో కలిసి పాల్గొన్నారు. మొదటగా దాతల సహకారంతో రూ.80 లక్షల నిధులతో నిర్మించిన తూర్పు, పడమర రాజగోపురాలను, రూ.5లక్షల దేవస్థానం నిధులతో నిర్మించిన 5 షెడ్లను, రూ.9 లక్షల దేవస్థానం నిధులతో కొనుగోలు చేసిన జనరేటర్ ను, రూ.24 లక్షలతో స్వచ్ఛ భారత్ స్కీము ద్వారా నిర్మించిన 24 టాయిలెట్స్ ను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు. అనంతరం సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చింతలూరు నూకాలమ్మ ఆలయంలో దేవస్థానం నిధులు, దాతల సహకారంతో గత రెండేళ్లలో అద్వితీయమైన అభివృద్ధి జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా దాతల సేవలను కొనియాడారు. ఈ మధ్య ఆలయంలో నూతనంగా తీసుకుని వచ్చిన నెల రోజులు పాటల ద్వారా రూ.70 లక్షల వరకూ ఆదాయం దేవస్థానానికి లభించిందని తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. మరీ ముఖ్యంగా భక్తులకు క్యూలైన్లు, త్రాగునీటి ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. శానిటేషన్ విషయంలో శ్రద్ధ చూపించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. దర్శనం సమయంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడాలన్నారు.అనంతరం నూకాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించరు,రచయిత సూర్య ఆకుల అమ్మవారిపై రచించి, వీడియో గా రూపొందించిన గీతాన్ని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆదిత్య యూనివర్సిటీలో “అడ్వాన్స్‌డ్ ఎంబెడెడ్ సిస్టమ్స్” పై ఐదు రోజుల వర్క్‌షాప్





**గండేపల్లి, పెన్ పవర్, మార్చ్, 13:**సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీలోని ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ (ఈసీఈ ) విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 09 నుండి 13 వరకు రెండవ సంవత్సరం ఇంజినీరింగ్ విద్యార్థుల కోసం “అడ్వాన్స్‌డ్ ఎంబెడెడ్ సిస్టమ్స్” అనే అంశంపై ఐదు రోజుల ప్రాయోగిక వర్క్‌షాప్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులలో ఎంబెడెడ్ సిస్టమ్స్‌పై ప్రాయోగిక జ్ఞానం మరియు సాంకేతిక నైపుణ్యాలను అభివృద్ధి చేయడం, అలాగే పరిశ్రమలలో ఉపయోగించే రియల్-టైమ్ అప్లికేషన్లపై అవగాహన కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు.

ఈ కార్యక్రమాన్ని ఏపీ ఎస్ ఎస్ డి సి (ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్) సహకారంతో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ ద్వారా విద్యార్థులకు ఆధునిక ఎంబెడెడ్ టెక్నాలజీలపై ప్రాయోగిక అనుభవం పొందే మంచి వేదిక లభించింది.

వర్క్‌షాప్ సందర్భంగా విద్యార్థులు వివిధ ఎలక్ట్రానిక్ పరికరాలు మరియు భాగాలను ఇంటర్‌ఫేస్ చేయడం ద్వారా ఎంబెడెడ్ ప్రోగ్రామింగ్, హార్డ్‌వేర్ ఇంటర్‌ఫేసింగ్, మరియు సిస్టమ్ డీబగ్గింగ్ వంటి అంశాల్లో ప్రాయోగిక పరిజ్ఞానం సంపాదించారు. శిక్షణ తరగతులు రియల్-టైమ్ అప్లికేషన్లపై దృష్టి సారించడంతో, స్మార్ట్ సిస్టమ్స్ మరియు రోజువారీ ఎలక్ట్రానిక్ పరికరాల్లో ఎంబెడెడ్ టెక్నాలజీలు ఎలా ఉపయోగిస్తారో విద్యార్థులు అర్థం చేసుకున్నారు.

ఈ వర్క్‌షాప్‌లో ముఖ్య ఆకర్షణగా హ్యాండ్స్-ఆన్ లెర్నింగ్ విధానం నిలిచింది. విద్యార్థులు బృందాలుగా పని చేస్తూ సరళమైన ఎంబెడెడ్ ప్రాజెక్టులు మరియు ఇంటరాక్టివ్ గేమ్స్ రూపొందించారు. ఈ కార్యకలాపాలు ద్వారా హార్డ్‌వేర్ మరియు సాఫ్ట్‌వేర్ సమన్వయాన్ని అనుభవిస్తూ, వారి సృజనాత్మకత, సమస్య పరిష్కార నైపుణ్యాలు మరియు టీమ్‌వర్క్ సామర్థ్యాలు మరింత మెరుగుపడ్డాయి.

ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఎగ్జిక్యూటివ్ ట్రైనర్ ఎస్. గణేష్ నిర్వహించారు. ఆయన ఎంబెడెడ్ సిస్టమ్ డిజైన్‌కు సంబంధించిన పరిశ్రమ అనుభవం, ప్రాయోగిక జ్ఞానం మరియు ఉత్తమ విధానాలను విద్యార్థులతో పంచుకున్నారు.

ఈ వర్క్‌షాప్ నిర్వహణకు డిప్యూటీ ప్రో-చాన్సలర్, వైస్ చాన్సలర్, ప్రో వైస్ చాన్సలర్లు, రిజిస్ట్రార్, స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ అసోసియేట్ డీన్ మరియు ఈసీఈ విభాగాధిపతి గారి ప్రోత్సాహం మరియు సహకారం లభించింది. ఇటువంటి కార్యక్రమాలు ఆదిత్య యూనివర్సిటీ యొక్క ప్రాయోగిక విద్య, ఆవిష్కరణలు మరియు నైపుణ్యాభివృద్ధి పట్ల ఉన్న కట్టుబాటును ప్రతిబింబిస్తూ, భవిష్యత్ ఇంజినీరింగ్ వృత్తులకు విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నాయి.

## చొప్పెల్ల హోటల్ పై విజిలెన్స్ దాడులు

తొమ్మిది గ్యాస్ సిలెండర్లు స్వాధీనం

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;** ప్రస్తుతం వంట గ్యాస్ కొరత ఏర్పడినందున విజిలెన్స్ అధికారులు హోటల్స్ పై దాడులు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగానే ఆలమూరు మండలం చొప్పెల్ల జాతీయ రహదారిపై ఉన్న ఓ హోటల్ పై గురువారం రాజమహేంద్రవరం విజిలెన్స్, స్థానిక సివిల్ సప్లై అధికారులు దాడులు నిర్వహించారు.అయితే హోటల్ నిర్వాహకుడికి కమర్షియల్ సిలిండర్లు అందుబాటులో లేనందున తొమ్మిది గృహ వినియోగానికి సంబంధించిన సిలిండర్లు వాడుతున్నట్లు గుర్తించి వాటిని స్వాధీన పరుచుకున్నారు.వాటిని గ్యాస్ గొడౌన్ కు తరలించి 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆలమూరు మండల సివిల్ సప్లై అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.



# అన్నదాత సుఖీభవ మూడో విడత నిధుల పంపిణీ

- కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు





**ఆత్రేయపురం, పెన్ పవర్ మార్చి 13 :**అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. పీఎం కిసాన్‌అన్నదాత సుఖీభవ మూడో విడత నిధుల విడుదల సందర్భంగా శుక్రవారం ఆత్రేయపురంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగాలను తిలకించారు.

అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుంటోందన్నారు. గోదావరి దయతో ప్రాంతం సస్యశ్యామలంగా ఉందని పేర్కొన్నారు. పీఎం కిసాన్‌అన్నదాత సుఖీభవ మూడో విడతలో భాగంగా కొత్తపేట నియోజకవర్గంలో 23,085 మంది రైతుల ఖాతాల్లో రూ.12.94 కోట్లు జమయ్యాయని తెలిపారు.కొత్తపేట మండలంలో 6,516 మందికి రూ.3.57 కోట్లు, ఆత్రేయపురం మండలంలో 5,258 మందికి రూ.3.03 కోట్లు, రావులపాలెం మండలంలో 5,018 మందికి రూ.2.72 కోట్లు, ఆలమూరు మండలంలో 6,293 మందికి రూ.3.62 కోట్లు జమయ్యాయని చెప్పారు. మొదటి విడతలో రూ.16.11 కోట్లు, రెండో విడతలో రూ.15.26 కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యాయని తెలిపారు.

రైతులు సేంద్రియ వ్యవసాయం, డిమాండ్ ఆధారిత పంటల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. రైతులకు రాయితీలపై వ్యవసాయ పరికరాలు అందిస్తూ సాగులో సాంకేతికతనుప్రోత్సహిస్తున్నామని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే 24 గంటల్లోనే రైతుల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఎల్డీవో రాజేశ్వరరావు, ఆకుల రామకృష్ణతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సకాలంలో స్పందించిన కొత్తపేట ప్రభుత్వ వైద్యులు లారీ డ్రైవర్ ప్రాణరక్షణ



**కొత్తపేట,పెన్ పవర్, మార్చి13;** మానవత్వాన్ని చాటుతూ కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు సకాలంలో స్పందించి లారీ డ్రైవర్ ప్రాణాలను కాపాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన అశోక్ జైస్వాల్ రావులపాలెం వద్ద లోడు తీసుకునే సమయంలో అకస్మాత్తుగా తీవ్రమైన గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు వెంటనే అతన్ని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విధుల్లో ఉన్న డాక్టర్ నాగరాజు, డాక్టర్ పూజిత వెంటనే పరీక్షలు చేసి అత్యవసర చికిత్స ప్రారంభించారు. గుండె రక్తనాళాల్లో గడ్డలను కరిగించేందుకు ఉపయోగించే రూ.50 వేల విలువైన టెనెక్టెప్లేస్ ఇంజెక్షన్‌ను ప్రభుత్వం అందించిన సదుపాయం ద్వారా ఉచితంగా ఇచ్చి ప్రాణాలను రక్షించారు. సమయానికి స్పందించిన వైద్యులు, ఆసుపత్రి సిబ్బందిపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. ప్రస్తుతం బాధితుడు వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నాడు.

# నేడు కొత్తపేట మండలంలో విద్యుత్ అంతరాయం



**కొత్తపేట, పెన్ పవర్, మార్చి 13;**కొత్తపేట 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త బ్రేకర్ ఎరక్షన్ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోనుంది. కొత్తపేట, కేదార్లంక, నారాయణలంక, వాడపాలెం, బండారుపేట, చిన్నమెరక, పెద్దమెరక, మద్దులమెరక, పనసలదొడ్డి, చిన్నగులపాలెం, పెద్దగులపాలెం, బోడిపాలెం, మందపల్లి తదితర ప్రాంతాలు ప్రభావితమవుతాయని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రాంబాబు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# బెదిరింపులకు భయపడొద్దు మీకు నేను అండగా ఉంటా: ముద్రగడ గిరిబాబు.



గిరిబాబుకు ఘన స్వాగతం పలికిన మర్రివీడు వైసీపీ శ్రేణులు.



**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 13:** వైయస్సార్ కాంగ్రెస్ వ్యతిరేకశక్తులు బెదిరింపులకు దిగిన, ప్రలోభాలకు గురిచేసిన ఎవరు భయపడవలదని ప్రజలకు అండగా నేనుంటానని వైయస్సార్ కాంగ్రెస్ ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ప్రత్తిపాడు వైసిపి ఇన్చార్జిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా మండల పరిధిలోని మర్రి వీడు గ్రామానికి గిరిబాబు శుక్రవారం విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామ వైసిపి నాయకులు సఖిరెడ్డి బుజ్జి, పార్టీ శ్రేణులతో ఘన స్వాగతం పలికారు. తొలుత గ్రామంలో దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

మొట్ట మొదటి గా మర్రివీడు పర్యటనకు వచ్చిన ముద్రగడ గిరిబాబుకు భారీ బైక్ ర్యాలీతో ఘనస్వాగతం పలికారు. గ్రామ వీధుల్లో బైక్ ర్యాలీతో తమ అభిమాన నేత ముద్రగడ గిరిబాబును ఊరేగింపుగా కొనసాగారు. జై ముద్రగడ అంటూ నినాదాలు చేస్తూ, సఖిరెడ్డి చిట్టిబాబు నివాసం వద్దకు ర్యాలీగా తరలి వచ్చారు. తమ అభిమాన నేతకు సాలువా కప్పి జై ముద్రగడ అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో

గిరిబాబు మాట్లాడుతూ అత్యంత అభిమానంతో స్వాగతం పలికిన,మర్రివీడు గ్రామ వైసిపి పార్టీ శ్రేణులకు, కార్యకర్తలకు, గ్రామ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. వైయస్సార్ కాంగ్రెస్ వ్యతిరేక వర్గం ఎన్నికల్లో ఎన్ని ప్రలోభాలకు గురిచేసిన లొంగవద్దని, బెదిరింపులకు అస్సలు భయపడరాదని అన్నారు. ప్రజల కష్టసుఖాల్లో అన్నింటా నేను అండగా ఉంటానని ముద్రగడ గిరిబాబు ప్రజలకు భరోసా ఇచ్చారు. ప్రజల్లో ఉత్సాహం చూస్తూ ఉంటే వైసిపి పార్టీకి ప్రజల్లో బలం బాగా పెరుగుతుందని అన్నారు.

వైసిపి పార్టీ బలోపేత దిశగా పనిచేస్తూ ప్రతి ఒక్కరికి అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. ఎవ్వరికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నన్ను నేరుగా సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి కాశీ,గొల్లపల్లి సురేష్, సఖి రెడ్డి బుజ్జి, సఖిరెడ్డి రాహుల్ గాంధీ, పలికెల బ్రహ్మం,అంజి, రామారావు, వీరబాబు, ధర్మ, వెంకన్న రాజు, లోవ రాజు, అప్పారావు, దొరబాబు, కాలారీ సత్తిబాబు, చంటిబాబు, కోరాడ దుర్గ, రామకృష్ణ, కొండబాబు, రమణిపేట రాజు, దొర, సతీష్, రాయవరం రమణ దుర్గ , కొండపల్లి బాబి, సీతా రాంబాబు, అడభాల భద్రరావు, వైసిపి ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి రాచర్ల రమేష్ తదితర వైసిపి పార్టీ శ్రేణులు ముద్రగడ అభిమానులు, ప్రజలు పాల్గొన్నారు.

# చెక్ బౌన్స్ కేసులో నిందితురాలికి శిక్ష

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**చెక్ బౌన్స్ కేసులో నిందితురాలు రాచకొండ మాణిక్యాంబకు ఆలమూరు స్పెషల్ కోర్టు జడ్జి సన్నిధిరావు ఏడాది జైలు శిక్ష, రూ 1.11లక్షలు జరిమానా విధించారు. స్థానికుల కథనం ప్రకారం కలవచర్లకు చెందిన వడ్డి మణిబాబు 2018లో రామచంద్రపురం మండలంలోని హసన్‌బాదకు చెందిన మాణిక్యాంబ పొలంపై తనఖా రిజిస్ట్రేషన్ చేయించుకుని రూ మూడు లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఆసమయంలో ఇచ్చిన చెక్కు బ్యాంకులో బౌన్స్ కావడంతో బాధిత వ్యక్తి మణిబాబు 2023లో స్థానిక స్పెషల్ కోర్టును ఆశ్రయించాడు. దీంతో కోర్టులో వాదోపవాదనలు అనంతరం జడ్జి శుక్రవారం తుదితీర్పును వెలువరించారు. ఈతీర్పులో నిందితురాలికి ఏడాది పాటు జైలుశిక్ష, బాధిత వ్యక్తికి రూ లక్ష, కోర్టుకు రూ పది వేలు పరిహారంగా చెల్లించాలని తుది తీర్పులో వెలువరించారు. బాధితుడు తరపున ఆలమూరుకు చెందిన న్యాయవాది గుణ్ణం వీర వెంకట సత్యనారాయణ వాదనలు వినిపించారు.

# నేడు ఏలేశ్వరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం.

**ఏలేశ్వరం, పెన్ పవర్, మార్చి 13:** నేడు ఏలేశ్వరం లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఈ.ఈ. బి వీరభద్రరావు శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 02.00గంటల వరకు ఏలేశ్వరం,ఎర్రవరం విద్యుత్ సబ్‌స్టేషన్లో లో ఆర్ డి.డి. ఎస్ పనుల నిమిత్తం విద్యుత్ సరఫరా శనివారం నిలిపివేయబడుతుందన్నారు. దీంతో ఏలేశ్వరం నగర పంచాయతీ , రూరల్ మండలం లో అన్ని గ్రామములో విద్యుత్ సరఫరా సుమారు 5 గంటలపాటు నిలిపివేయడం జరుగుతుందన్నారు. సంబంధిత లీడర్లపై గల గ్రామలలో ఇంటిసర్వీసులకు, వ్యవసాయ బోరు సర్వీసులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.ఈ విషయాన్ని వినియోగదారులు గ్రహించి డిపార్ట్మెంట్ వారికి సహకరించవలసిందిగా ఏలేశ్వరం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏ ఈ బి. సూర్యనారాయణ ఆ ప్రకటనలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# పదవతరగతి పరీక్షలకు ఏర్పాట్లు

**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 13**: జగ్గంపేట మండలంలో పదవతరగతి పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు జగ్గం పేట ఎంఈవో ఆర్.స్వామి తెలిపారు. ఈమేరకు శుక్రవారం ఆయన పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఈనెల 16వతేదీ నుంచి ఏప్రిల్ 1వతేదీ వరకు రోజు విడిచి రోజు పరీక్షలు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు జరుగుతాయన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఒక గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలన్నారు. విద్యార్థులకు ఆయా రూట్లలో ఫ్రీ బస్సు సౌకర్యం ప్రభుత్వం కల్పించిందన్నారు. పరీక్షలు సజావుగా జరిగేలా అవసరమైన ఏర్పాట్లు చేశామన్నారు. మండలంలో ఐదు సెంటర్లలో జరిగే పరీక్షలకు 1293మంది విద్యా ర్థులు హాజరవుతారన్నారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, భాష్యం స్కూల్ జగ్గంపేట, శ్రీ చైతన్య జగ్గంపేట, శ్రీ స్వామి వివేకానంద జగ్గంపేట, కాట్రావులపల్లి హైస్కూల్లో పరీక్షలు జరుగుతాయని ఎంఈవో స్వామి తెలిపారు.

# తెలుగు సాహిత్యానికి చిరస్థాయి కీర్తి తెచ్చిన మొల్లా కవిత్వం



- ఎంపీడీవో ఏ. రాజు
- తొలి కవయిత్రి మొల్లా జయంతి సందర్భంగా ఘన నివాళులు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**మండల కేంద్రమైన ఆలమూరు ఎంపీడీవో కార్యాలయంలో తెలుగు తొలి కవయిత్రి మొల్లా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఏ. రాజు మాట్లాడుతూ మొల్లా తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం సంపాదించుకున్న గొప్ప కవయిత్రి అని అన్నారు. ఆమె రచించిన మొల్లా రామాయణం తెలుగు సాహిత్యంలో అమూల్యమైన గ్రంథమని పేర్కొన్నారు. సులభమైన, సరళమైన తెలుగు భాషలో రామాయణ కథను ప్రజలకు అర్థమయ్యే విధంగా అందించిన మహత్తర కృషి మొల్లాదని తెలిపారు. ముఖ్యంగా ఆమె రచనల్లో భక్తి, నైతిక విలువలు, సాంప్రదాయాల ప్రతిబింబం స్పష్టంగా కనిపిస్తాయని అన్నారు. రాజులు, పండితులు మాత్రమే సాహిత్యం రాయగలరనే భావనను చెరిపేసి సాధారణ ప్రజలకు కూడా సాహిత్యాన్ని చేరువ చేసిన గొప్ప కవయిత్రి మొల్లా అని కొనియాడారు. ఆమె రచనలు తెలుగు భాషకు గౌరవాన్ని తీసుకువచ్చాయని, నేటి తరానికి కూడా స్ఫూర్తినిచ్చేలా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో మెహెర్ ప్రకాశ్, సతీష్,వలి, సత్యనారాయణ, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొని మొల్ల సేవలను స్మరించుకుంటూ ఆమెకు ఘన నివాళులు అర్పించారు.

# ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజాదర్బార్.



చింతలూరులో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;**ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. చింతలూరు నూకాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఆయన శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. మొత్తం 32 వినతులు అందగా అందులో పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల నుంచి అందిన ప్రతీ వినతి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్ ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు.

# ఎమ్మెల్యే నెహ్రూకు గంగమ్మ తల్లి గావు సంబరానికి ఆహ్వానం



**జగ్గంపేట, పెన్ పవర్, మార్చి 13:** జగ్గంపేట మండలం ఇర్రిపాక శివ కేశవుల ఆలయం వద్ద జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూకు వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరానికి శుక్రవారం వైభోగుల పెద్ద గొల్ల అప్పారావు, వైబోగుల నారాయణమూర్తి, వైభోగుల వీరపండు, వైభోగుల సత్తిబాబు, వైబోగుల గంగరాజు ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా శ్రీ గంగమ్మ అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ జగ్గంపేట కాకినాడ రోడ్ లో గల కో-ఆపరేటివ్ బ్యాంక్ పక్కన పెద్ద గొల్ల గారి వీధిలో వైభోగుల వారి ఆడపడుచు శ్రీ గంగమ్మ తల్లి గావు సంబరం మార్చి 15వ తేదీ ఆదివారం నుండి మార్చి 16వ తేదీ సోమవారం వరకు ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మా సాంప్రదాయ ఆట తప్పిడి గుళ్ళతో గంగమ్మ తల్లికి నీరాజనం పలుకుతామని 16వ తేదీ సోమవారం ఉదయం 11 గంటల నుండి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వైభోగుల శ్రీనివాస యాదవ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ వైభోగుల కొండబాబు యాదవ్, జగ్గంపేట శ్రీకృష్ణ యాదవ్ సంఘం అధ్యక్షులు మొరుకుర్తి రాజు యాదవ్, వైభోగుల వీరపండు, వైభోగుల సతీష్, వైభోగుల వీరబాబు, యాదవ్ సంఘం పెద్దలు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# రైతు సంక్షేమానికి ఓటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత.

-అన్నదాత సుఖీభవ,పీఎం కిసాన్ 3వ విడత నిధుల జమ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ. -నియోజవర్గంలో 30 వేల 820 మంది రైతులకు 17 కోట్ల 42 లక్షల రూపాయలు జమ





**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 13:** రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కిర్లంపూడి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణలో రైతన్నా నీకోసం కార్యక్రమంలో భాగంగా అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమం వ్యవసాయ శాఖ ఏడిఏ,ఎన్ దైవకుమార్, మండల వ్యవసాయ శాఖ అధికారిణి నాగం సుధామాధురి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత వైసీపీ పాలనలో రైతులు అనేక విధాలుగా మోసపోయారని విమర్శించారు.
అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకం కింద మూడో విడతలో ఒక్కో రైతుకు రూ.6,000 చొప్పున జగ్గంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 30,820 మంది రైతుల ఖాతాల్లో మొత్తం రూ.17.42 కోట్ల రూపాయలు జమ అయినట్లు ఆయన తెలిపారు. రైతులకు సాగు పెట్టుబడికి ఈ సాయం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ టిడిపి నాయకులు ఎస్వీఎస్ అప్పలరాజు, మండల టిడిపి అధ్యక్షుడు వీరంరెడ్డి కాశీబాబు, కందుల చిట్టిబాబు, పోతుల మోహనరావు,కొత్త కొండబాబు, చదరం చంటిబాబు,గుడాల శ్రీలత రాంబాబు,తూము కుమార్, కుర్ల చినబాబు, కాళ్ళ వెంకటేష్,గొడే దొరబాబు మండల బిజెపి అధ్యక్షులు శరకణం రాజబాబు,నైదాన రఘు పలువురు కూటమి నాయకులు మూడు మండలాల వ్యవసాయ శాఖ అధికారులు ఎస్ నరసింహ, జయలక్ష్మి, పి రాజేశ్వరి, ఏఈఓ ఆకుల సురేష్,వి ఏలు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ
మరిన్ని వివరాలకు సంప్రదించండి
93948 55244
షరతులు వర్తిస్తాయి

## శీలలో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకాల కార్యక్రమం

రైతుల ఖాతాల్లో రూ.6,000 జమ జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్





**కాజులూరు, పెన్ పవర్,మార్చి 13:** కేంద్రం మరియు రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న పీఎం కిసాన్ 22వ విడతతో పాటు అన్నదాత సుఖీభవ 3వ విడత నిధులను శుక్రవారం రైతుల ఖాతాల్లో జమ చేశారు. పీఎం కిసాన్ కింద రూ.2,000, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.4,000 చొప్పున మొత్తం రూ.6,000 రైతుల ఖాతాల్లో జమ చేయబడింది. ఈ సందర్భంగా కాజులూరు మండలం లోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో సాయంత్రం 4 గంటల నుంచి కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. మండలంలోని శీల గ్రామ రైతు సేవా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ హాజరై రైతులతో సమావేశమై పథకాల అమలుపై వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నాయని తెలిపారు. రైతుల ఖాతాల్లో నేరుగా ఆర్థిక సహాయం జమ కావడం ద్వారా వారికి ఉపశమనం కలుగుతుందని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా రైతులకు సంబంధించిన రూ.84.80 కోట్ల చెక్కును శీల గ్రామంలో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ మరియు స్థానిక రైతు లబ్ధిదారులకు అందజేశారు. కాజులూరు మండలంలో మొత్తం 8,864 మంది రైతులకు అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.3.55 కోట్లు, 7,730 మంది రైతులకు పీఎం కిసాన్ పథకం కింద రూ.1.55 కోట్లు చెల్లించబడగా, మొత్తం రూ.5.10 కోట్లు రైతులకు లబ్ధి చేకూరనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో శీల గ్రామ సర్పంచ్ కోమలి వెంకటరమణ, తహశీల్దార్ జి.ఆర్. ఠాగూర్, ఎంపీడీవో జే. రాంబాబు, వ్యవసాయ శాఖ అధికారులు, ఏఈఓ శ్రీనివాస్ వర్మ, ఏఈఓ ప్రశాంత్, ముమ్మిడి గోపి, కోనపరెడ్డి శివకుమార్, నల్లమిల్లి రామారెడ్డి, గుంటముక్కల వెంకటేశ్వరరావు, కోన అయ్యప్ప నాయుడు, గరగ కొండలరావు,రెవెన్యూ, సచివాలయం సిబ్బంది మరియు రైతులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కిట్లు అందజేత



**కాట్రేనికోన పెన్ పవర్ మార్చి 13:** మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మోసుగంటీ వెంకటేశ్వర రావు కొమరగిరిపట్నం మరియు రుద్రరాజు సీతాపతిరాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ అండ్ ఛారిటబుల్ ట్రస్ట్ గోడిలంక అధ్యక్షులు రుద్రరాజు రమేష్ బాబు వారి సంయుక్త ఆర్థిక సహకారం తో మొట్టమొదటి గా 10 తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరు అవుతున్న జడ్పీహెచ్ఎస్ బ్రహ్మశమేధ్యం విద్యార్థులకు పరీక్ష కిట్ల బహూకరణ ఎస్ టి యు కాట్రేనికోన ఆధ్వర్యంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల అధ్యక్షతన పి వి సత్యనారాయణ,జరిగింది ఈ కార్యక్రమంలో పాఠశాల 10వ తరగతి విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాఠశాల ఉపాధ్యాయులు ఎస్టీయూ కాట్రేనికోన మండల యూనిట్ పాల్గొన్నారు.

1. పరీక్ష అట్ట
2. లాంగ్ స్కేల్
3. రెండు పెన్నులు
4. హాల్ టికెట్
5. పెన్సిల్
6. రబ్బరు
7. సార్పనర్

## దివ్యాంగ బాలునికి వీల్‌చైర్ అందజేత

మానవతా హృదయంతో ముందుకొచ్చిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్



**రామచంద్రపురం, పెన్ పవర్,మార్చి 13:** సమాజ సేవలో ఎప్పుడూ ముందుండే సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ మరోసారి తన మానవతా సేవను చాటుకుంది. రామచంద్రపురం నియోజకవర్గం కె.గంగ వరం మండలం తాళ్లపూడి పంచాయతీ భీమ్‌నగర్‌కు చెందిన దివ్యాంగ బాలుడు మోర్త సాయికి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం మూడు చక్రాల వీల్‌చైర్‌ను అందజేశారు. శుక్రవారం రామచంద్రపురంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వాసంశెట్టి సత్యంను కలిసిన బాలుడి తల్లి మోర్త రాజేశ్వరి తన కుమారుడి ఆరోగ్య పరిస్థితిని వివరించి సహాయం కోరారు. ఆమె వినతిని సానుభూతితో విన్న వాసంశెట్టి సత్యం వెంటనే స్పందించి, బాలుడి సౌకర్యార్థం మూడు చక్రాల వీల్‌చైర్‌ను అందజేసి ఆర్థిక సహాయం కూడా చేశారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ సమాజంలో ఆపన్నులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అవసరమైన చోట సేవ చేయడం ద్వారానే నిజమైన సంతృప్తి లభిస్తుందని అన్నారు. దివ్యాంగులు సమాజంలో ధైర్యంగా ముందుకు సాగేందుకు తమ ఫౌండేషన్ ఎల్లప్పుడూ తోడ్పాటు నందిస్తుందని తెలిపారు. అంతేకాకుండా బాలుడి పరిస్థితిని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తీసుకెళ్లి, అతనికి దివ్యాంగుల పింఛన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అవసర సమయంలో సహాయం అందించిన సత్యం వాసంశెట్టి ఫౌండేషన్‌కు బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ కంచుమర్తి బాబురావు, కవల నానాజీ, కాటే సుబ్రమణ్యం, ఏసుదాసు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## మొల్ల రామాయణం కమనీయం ఆలమూరులో జయంతి వేడుకలు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 13;** మొల్ల రచించిన రామాయణం కమనీయమైనదని, తెలుగువారందరికి ఆరాధ్యంగా నిలిచిందని ఆలమూరు మండల శాలివాహన సంఘ అధ్యక్షులు మల్లవరపు మల్లేశ్వరరావు కొనియాడారు. కవయిత్రి మొల్ల జయంతి వేడుకలను ఆలమూరులో ఆయన ఆధ్వర్యంలో జరిపారు. మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. తెలుగులో తొలి మహిళా కవయిత్రి మొల్ల కావడం మనందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో మండల, గ్రామ శాలివాహన సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బార్ కార్యక్రమం.

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ.



**కిర్లంపూడి, పెన్ పవర్,మార్చి 13:** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మంగా ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జగ్గంపేట ఎమ్మెల్యే, తిరుమల తిరుపతి దేవస్థానం పాలకవర్గ సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. కిర్లంపూడి మండలం ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రజల నుంచి వినతులు, అభ్యర్థనలు స్వీకరించారు. పలు సమస్యలపై వినతులు అందగా అందులో పలు సమస్యలను అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ప్రజల నుంచి అందిన ప్రతీ వినతి పరిష్కారం అయ్యేలా చూడాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా దర్బార్ ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కుటమి నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## దంతాల ఆరోగ్య సంరక్షణ తప్పని



**కాకినాడ రూరల్, పెన్ పవర్, మార్చి 13:**
మనం తీసుకునే ఆహారం సక్రమంగా జీర్ణం కావాలంటే దంతాల ఆరోగ్యాన్ని కచ్చితంగా సంరక్షించుకోవడం చాలా ముఖ్యమని ప్రముఖ దంత వైద్యులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేటలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దంతాలు దృఢంగా, పటిష్టంగా ఉంటేనే అన్ని రకాల ఆహార పదార్థాలను తీసుకోగలుగుతామని ఆయన తెలిపారు. అప్పుడు మాత్రమే శరీరానికి అవసరమైన పోషకాలు సక్రమంగా అందుతాయని, తద్వారా రోగ నిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. దంతక్షయం ఉన్నప్పుడు సరైన ఆహారాన్ని తీసుకోలేని పరిస్థితులు ఏర్పడతాయని, దంతాల మధ్య ఖాళీలు లేదా ఇతర సమస్యలు కనిపించిన వెంటనే దంత వైద్యులను సంప్రదించాలని సూచించారు. రోజుకు కనీసం రెండు సార్లు ఉదయం మరియు రాత్రి పడుకునే ముందు దంతాలను బ్రష్ చేయాలని, ఏ ఆహారం తీసుకున్న తర్వాతైనా మంచినీటితో నోటిని పుక్కిలించాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ సూచించారు. ఈ కార్యక్రమంలో అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, ఎస్. శ్రీ నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచకప్ జట్టులోని సంజు శాంసన్ ఫోటోని తొలగించిన టీమిండియా కెప్టెన్..









**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026 విశ్వవిజేతగా టీమిండియా నిలిచింది. మార్చి8వ తేదీన అహ్మదాబాద్ లోని నరేంద్ర మోడీ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై 96 పరుగుల తేడాతో గెలిచి మూడోసారి పొట్టి కప్ ని ముద్దాడింది. ఈ ప్రపంచకప్ గెలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. సూపర్--8లో వెస్టిండీస్ పై 97 పరుగులు, సెమీఫైనల్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ పై 89 రన్స్ తో పాటు ఫైనల్ మ్యాచ్‌లో న్యూజిలాండ్ పై 89 పరుగులు చేశాడు. దీంతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కూడా సంజు శాంసన్ కైవసం చేసుకున్నాడు. ఇండియన్ టీమ్ టీ20 వరల్డ్ కప్‌ను గెలవడంతో టెస్టు, వన్డే కెప్టెన్ అయిన శుభ్‌మన్ గిల్ సోషల్ మీడియా వేదికగా భారత జట్టుకి శుభాకాంక్షలు చెప్పాడు. టీమిండియా ప్రపంచ కప్ ట్రోఫీని అందుకునే సమయలో దిగిన ఫోటోను తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పోస్టు చేశాడు. కానీ ఇప్పుడు ఈ ఫోటో పైనే తీవ్ర వివాదం కొనసాగుతుంది. గిల్ పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కనిపించడం లేదని క్రికెట్ అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కావాలనే ఫోటోలో శాంసన్‌ను గిల్ తీసివేశాడని కామెంట్స్ చేస్తున్నారు. టీమ్ లో గిల్ స్థానంలో సంజు శాంసన్ కి చోటు దక్కడం వలన కోపంతో ఉన్న టీమిండియా వన్డే, టెస్టుల కెప్టెన్ గిల్ ఇలా పగ తీర్చుకున్నాడుని తెలుస్తుంది. ఇక అదే రోజు సూర్యకుమార్ యాదవ్ పోస్ట్ చేసిన ఫోటోలో సంజూ శాంసన్ కనిపించడాన్ని ప్రస్తావిస్తున్నారు. అదే ఫోటోను గిల్ ఎడిట్ చేసి పోస్ట్ చేశాడా? అని క్వశ్చన్ చేస్తున్నారు. వాస్తవానికి శుభ్‌మన్ గిల్.. సంజు శాంసన్ ను ఫోటో నుంచి తొలగించే ఛాన్స్ లు చాలా తక్కువగా ఉన్నాయి. ఎందుకంటే టీ20 వరల్డ్ కప్ 2026 వేడుకల రోజున తీసిన చాలా ఫోటోలు సోషల్ మీడియాలో దర్శనమిస్తున్నాయి. యశస్వి జైస్వాల్ కూడా టీమిండియాకు అభినందలు తెలుపుతూ చేసిన ఫోటోలోనూ సంజూ కనిపించలేదు..

# అన్ని టీమ్స్ ఈ రూల్స్ పాటించాల్సిందే.. ఐపీఎల్ ప్రారంభానికి ముందు బీసీసీఐ కఠిన ఆంక్షలు..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026లో జరిగే 19వ ఎడిషన్ మరి కొద్ది రోజుల్లోనే ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన బెంగళూరులోని ఎం.చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) వర్సెస్ సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) మధ్య మ్యాచ్‌తో మెగా టోర్నమెంట్ స్టార్ట్ అవుతుంది. మెగా టోర్నమెంట్ ప్రారంభానికి కేవలం రెండు వారాల సమయం మాత్రమే ఉండటంతో, భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) 10 ఫ్రాంచైజీలు అనుసరించాల్సిన కొన్ని కీలక సూచనలను జారీ చేసింది.క్రిక్‌బజ్ నివేదిక ప్రకారం.. ఏ జట్టు కూడా ప్రత్యర్థి జట్టు ఉపయోగించిన అదే పిచ్‌పై ప్రాక్టీస్ చేయకూడదు, ఒకేసారి రెండు జట్లకు ప్రాక్టీస్ సెషన్‌లలు నిర్వహించొద్దు.. ప్రతి జట్టుకు కేటాయించిన ప్రాక్టీస్ సెషన్ కోసం కొత్త నెట్‌లు తప్పనిసరిగా అందించాలని బీసీసీఐ ఫ్రాంచైజీలకు సూచించింది. అన్ని ఫ్రాంచైజీ తన తొలి హోమ్ మ్యాచ్‌కు నాలుగు రోజుల ముందు నుంచి స్టేడియంలోని ప్రధాన పిచ్‌పై ప్రాక్టీస్ చేయకూడదని వెల్లడించింది. ఈ కాలంలో ప్రాక్టీస్ చేయడానికి ప్రత్యామ్నాయ మైదానాన్ని సంబంధిత రాష్ట్ర క్రికెట్ బోర్డు ఫ్రాంచైజీకి ఎలాంటి ఖర్చు లేకుండా అందించాలని తెలిపింది.ఐపీఎల్ సీజన్ కోసం పిచ్‌ను సిద్ధం చేయడానికి, సంబంధిత ఫ్రాంచైజీ యొక్క తొలి హోమ్ మ్యాచ్‌కు ముందు నాలుగు రోజులలో ప్రధాన పిచ్ పై ఎటువంటి ప్రాక్టీస్ సెషన్‌లు లేదా ప్రాక్టీస్ మ్యాచ్‌లు జరగకూడదు అని బీసీసీఐ పేర్కొనింది. ఈ కొత్త మార్గదర్శకాలు ఫ్రాంచైజీలకు సమయాన్ని సకాలంలో వినియోగించుకునేలా, పిచ్ పరిస్థితులను రక్షించడానికి రూపొందించబడ్డాయి.

# సన్‌రైజర్స్ లీడ్స్ జట్టులో పాక్ ప్లేయర్.. బీసీసీఐ రియాక్షన్ ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇంగ్లాండ్ లో జరగనున్న 'ది హండ్రెడ్' లీగ్ వేలంలో భాగంగా పాకిస్తాన్ స్పిన్నర్ అబ్రార్ అహ్మద్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ జట్టు రూ.2.34 కోట్లకు దక్కించుకున్న విషయం తెలిసిందే. దీనిపై భారత్ లో తీవ్ర స్థాయిలో విమర్శలు వస్తున్నాయి. ఓ భారతీయ ఫ్రాంచైజీ పాక్ ప్లేయర్‌ను కొనుగోలు చేయడంపై క్రికెట్ ఫ్యాన్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేలంలో సన్‌రైజర్స్ సీఈవో కావ్య మారన్, హెడ్ కోచ్ డానియల్ వెట్టోరి పాల్గొన్నారు. దీంతో ఐపీఎల్ 2026లో కూడా సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ఆడే మ్యాచ్‌లను బాయ్‌కాట్ చేయాలంటూ సోషల్ మీడియాలో ఫ్యాన్స్ పోస్టులు పెడుతున్నారు. దీంతో ఎట్టకేలకు ఈ వివాదంపై బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా రియాక్ట్ అయ్యారు. ఇది ఐపీఎల్‌కు సంబంధించిన విషయం మాత్రం కాదు.. విదేశీ లీగ్‌లో జరిగిన వ్యవహారం.. అందువల్ల ఈ అంశంపై బీసీసీఐ జోక్యం చేసుకునే ఛాన్స్ లేదన్నారు. అది ఆ ఫ్రాంచైజీదే తుది నిర్ణయం అని స్పష్టం చేశారు. గతేడాది ఆపరేషన్ సింధూర్ సమయంలో అబ్రార్ ఇండియన్ ఆర్మీని విమర్శిస్తూ మైదానంలోనే రెచ్చిపోయాడు. అలాంటి సదరు పాక్ ప్లేయర్‌ను సన్‌రైజర్స్ లీడ్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేయడంపై పెద్ద ఎత్తున విమర్శలు కొనసాగుతున్నాయి. టీమిండియా వర్సెస్ –పాకిస్తాన్ మధ్య రాజకీయ ఉద్రిక్తతలతో 2008 తర్వాత ఇప్పటి వరకు పాక్ కి చెందిన ఏ అంతర్జాతీయ ఆటగాడు కూడా ఐపీఎల్ టోర్నీలో ఆడలేదు. కానీ ప్రపంచంలోని ఇతర టీ20 లీగ్‌లలో మాత్రం ఐపీఎల్ యాజమాన్యంలోని జట్లు పాకిస్థాన్ ప్లేయర్స్ ని తీసుకున్న విషయం తెలిసిందే.

# 'రామాయణ 2'.. నితేష్ తివారీ ధీమా వెనుక అసలు కథేంటి?



భారతీయ చలనచిత్ర పరిశ్రమలో ఒక భారీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్తుందంటేనే ఎన్నో లెక్కలు ఉంటాయి. అలాంటిది పార్ట్ 1 విడుదల కాకముందే, రెండో భాగం షూటింగ్ మొదలుపెట్టడం అనేది మామూలు విషయం కాదు. గతంలో రాజమౌళి 'బాహుబలి'కి, మణిరత్నం 'పొన్నియిన్ సెల్వన్'కు ఇలాంటి సాహసమే చేశారు. ఇప్పుడు నితేష్ తివారీ తన డ్రీమ్ ప్రాజెక్ట్ 'రామాయణ' విషయంలో అదే బాటలో పయనిస్తున్నారు. అసలు మొదటి భాగం ఫలితం తెలియకుండానే రెండో భాగంపై ఇంతటి ధీమా చూపించడం వెనుక ఉన్న రహస్యం ఏంటనేది ఇప్పుడు ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ?దీనికి ప్రధాన కారణం లాస్ ఏంజిల్స్‌లో జరిగిన ఒక ప్రత్యేక స్క్రీనింగ్ అని తెలుస్తోంది. పార్ట్ 1 కి సంబంధించిన రఫ్ కట్‌ను అక్కడ ప్రదర్శించగా, విజువల్స్ కథా గమనం చూసి మేకర్స్ షాక్ అయ్యారట.

హాలీవుడ్ స్థాయి టెక్నికల్ వాల్యూస్‌తో సినిమా అద్భుతంగా వచ్చిందనే నమ్మకం కలగడంతో, ఏమాత్రం ఆలస్యం చేయకుండా పార్ట్ 2 పనులను వేగవంతం చేశారు. రన్బీర్ కపూర్ రాముడిగా, సాయి పల్లవి సీతగా ఇప్పటికే తమ పాత్రల్లో పరకాయ ప్రవేశం చేయడంతో, అదే ఫ్లోలో లంక ప్రయాణానికి సంబంధించిన కీలక ఘట్టాలను కూడా పూర్తి చేయాలని దర్శకుడు భావిస్తున్నారు. ?ఇలా రెండు భాగాలను ఏకకాలంలో ప్లాన్ చేయడం వెనుక ఒక బలమైన ప్లస్ పాయింట్ ఉంది. నటీనటుల లుక్స్ వారి బాడీ లాంగ్వేజ్‌లో ఎటువంటి తేడా రాకుండా జాగ్రత్త పడవచ్చు. ముఖ్యంగా రామాయణం లాంటి ఇతిహాసాన్ని వెండితెరపై చూపిస్తున్నప్పుడు కంటిన్యూటీ చాలా ముఖ్యం. లంక వైపు సాగే ప్రయాణం, హనుమంతుడిగా సన్నీ డియో ఎంట్రీ వంటి కీలక సీన్లు పార్ట్ 2 లోనే ఎక్కువగా ఉంటాయి. అందుకే ఒక షెడ్యూల్ పూర్తి కాగానే వెంటనే రెండో భాగం సెట్స్‌ను సిద్ధం చేసి, షూటింగ్ గ్యాప్ లేకుండా చూసుకుంటున్నారు. ?అయితే ఇందులో రిస్క్ కూడా లేకపోలేదు. సుమారు రూ. 4000 కోట్ల భారీ పెట్టుబడితో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో పార్ట్ 1 ఫలితంపైనే పార్ట్ 2 భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. ఒకవేళ మొదటి భాగానికి ఆశించిన స్పందన రాకపోతే రెండో భాగం పరిస్థితి ఏంటనే ప్రశ్న సహజంగానే వస్తుంది. కానీ రామాయణంకు ఉండే బజ్ వేరు, దాన్ని సరైన పద్ధతిలో విజువల్ వండర్‌గా చూపిస్తే ప్రేక్షకులు ఖచ్చితంగా ఆదరిస్తారనేది మేకర్స్ నమ్మకం. పైగా యాష్ లాంటి స్టార్ రావణుడిగా నటిస్తుండటం సినిమాకు పాన్ ఇండియా స్థాయిలో పెద్ద క్రేజ్‌ను తెచ్చిపెడుతోంది. ?ప్రస్తుతం ముంబైలో జరుగుతున్న షెడ్యూల్‌లో రాముడి వనవాసం తర్వాత జరిగే కీలక ఘట్టాలను చిత్రీకరిస్తున్నారు. సీతమ్మ అపహరణ తర్వాత రాముడిలోని అలజడి, ఆపై హనుమంతుడిని కలవడం వంటి భావోద్వేగ సీన్లతో పాటు భారీ యుద్ధ సన్నివేశాలను కూడా ఈ షెడ్యూల్‌లో ప్లాన్ చేశారు. టెక్నాలజీ పరంగా కూడా ఎక్కడా రాజీ పడకుండా, అంతర్జాతీయ సాంకేతిక నిపుణుల సలహాలతో విజువల్ ఎఫెక్ట్స్‌ను రూపొంది స్తున్నారు. 2026 దీపావళికి మొదటి భాగం విడుదల చేసేలా మేకర్స్ పక్కా ప్రణాళికతో ఉన్నారు. 'రామాయణ' టీమ్ చేస్తున్న ఈ సాహసం భారతీయ సినిమా స్థాయిని మరో మెట్టు ఎక్కించేలా కనిపిస్తోంది. మరి 2027లో రాబోయే రెండో భాగం నాటికి మొదటి భాగం ఎటువంటి అంచనాలను క్రియేట్ చేస్తుందో వేచి చూడాలి.



పెద్ది పట్ల తనకున్న ప్రేమను వ్యక్తం చేసింది వేదవికా



అద్భుతమైన ఎత్నిక్ లుక్‌తో సంయుక్తా మీనన్ తలదాచుకుంది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 4-79, Revenue Colony, Tammireddy Palem, Kottapeta Editor : Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A3664 , e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965